
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

కర్నూలు
జిల్లా వార్తలు 5
బుధవారం 12 ఫిబ్రవరి 2025

చెట్నహాల్లి శ్మశాన లొల్లి..!



ప్రభుత్వం కేటాయించిన నది ఒడ్డున శ్మశాన స్థలం

మంత్రాలయం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆరగడుల స్థలం కోసం మొదలైన వివాదం ఆరని చిచ్చులా తయారైంది. చెట్నహాల్లిలో దళిత, బీసీ వర్గాల మధ్య తలెత్తిన శ్మశాన గొడవ తెగని సమస్యగా మారింది. ఇప్పటికే ఇరువర్గాల్లోని 80 మందిపై కేసులు నమోదైనప్పటికీ ఎవరూ వెనక్కి తగ్గడం లేదు. శ్మశానాన్ని మార్చాలని దళితులు డిమాండ్ చేస్తుండగా బీసీలు మాత్రం యథావిధిగా ఉంచాలని కోరుతున్నారు. ఈ వివాదం రెవెన్యూ పోలీసులు అధికారులకు తలనొప్పిగా మారింది.

మంత్రాలయం మండలంలోని చెట్నహాల్లి గ్రామంలో 113 సర్వే నెంబరులో 3.83 ఎకరాల రస్తా పోరంబోకు ఉంది. ఇందులో 40 సెంట్లు హైవే రోడ్డుకు, 42 సెంట్లు గురుబోధ తీసుకున్న వారి సమాధుల కోసం, మిగిలిన 22 సెంట్ల స్థలాన్ని గ్రామ రస్తాకు కేటాయించారు. ఇందులో ఉన్న 1.37 ఎకరాల స్థలాన్ని అన్ని కులాల వారు గత 70 ఏళ్లుగా శ్మశానానికి ఉపయోగించుకుంటున్నారు. అయితే ఇదే సర్వే నెంబరులోని 1.42 ఎకరాల భూమిలో గత ప్రభుత్వం జగనన్న కాలనీ ఏర్పాటు చేసింది. దీంతో అసలు సమస్య మొదలైంది.

- జగనన్న కాలనీనా.. శ్మశాన స్థలమా..
- చెట్నహాల్లిలో ముదిరిన సమస్య
- వెనక్కి తగ్గేదేలే అంటున్న ఇరువర్గాలు
- ఆ భూమిని వదిలేదంటున్న బీసీ వర్గాలు
- మరో చోటికి మార్చాలని దళితుల డిమాండ్
- తలలు పట్టుకుంటున్న రెవెన్యూ, పోలీసు అధికారులు
- ఇప్పటికే ఇరువర్గాల్లోని 80 మందిపై కేసులు నమోదు



జగనన్న కాలనీలో శ్మశానం

శ్మశానాన్ని కబ్జా చేసిన వారికి నోటీసులు జారీ

ప్రభుత్వం కేటాయించిన 126 సర్వే నెంబరులోని 3.54 ఎకరాల శ్మశాన స్థలాన్ని గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమించుకున్నారు. 14 సెంట్లు ఆర్పీ బసవన్నగౌడు, 89 సెంట్లు బెస్త నాగరాజులు, 85 సెంట్లు తెలుగు భీమన్న ఆక్రమించుకున్నారు. దీంతో వీరికి రెవెన్యూ అధికారులు వీరికి నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా సర్వే నెం.125లోని రస్తా పోరంబోకు స్థలాన్ని కూడా కబ్జా చేశారని 2018లో నాటి తహసీల్దార్ దేవ చంద్రశేఖర్ ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారు.

మిగతా 6వ పేజీలో

తుంగభద్ర నది ఒడ్డున కేటాయించినా..

గ్రామానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న తుంగభద్ర నది ఒడ్డున 126 సర్వే నెంబరులో 3.54 ఎకరాలు శ్మశానం కోసం కేటాయించినట్టు రికార్డులో ఉంది. అయితే ఈ శ్మశానం గ్రామానికి దూరంగా ఉండడంతో ఉపయోగించుకోవడం లేదు. పైగా ఉన్న దారి కబ్జాకు గురి కావడంతో శవాన్ని మోసుకెళ్లడం ఇబ్బందికరంగా మారింది. కొంత మంది ఉన్నత వర్గాలు మాత్రం అతికష్టంపై సాగు చేసిన వరి మడుల్లోనే వెళ్లి అంత్యక్రియలు చేస్తున్నారు. మిగతా కులాలు మాత్రం గ్రామానికి ఆనుకున్న ప్రభుత్వ రస్తా పోరంబోకులోనే అంత్యక్రియలు చేస్తున్నారు. గతంలో ఊరు చిన్నదిగా ఉండటంతో ఎటువంటి సమస్య రాలేదు. ఊరిలో రెండు శ్మశాన వాటికల మధ్య జగనన్న కాలనీకి పట్టా కేటాయించడంతో సమస్య మొదలైంది.

జగనన్న కాలనీ ఏర్పాటు

సర్వే నెంబరు 113లోని 1.42 ఎకరాల్లో జగనన్న కాలనీ పేరుతో 45 మంది దళితులకు పట్టాలు ఇచ్చారు. కొంత మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. కొన్ని బేస్‌మట్టం, లెంటల్, టాప్ లెవెల్‌లో ఉన్నాయి. శ్మశానం పక్కనే ఉండడంతో దళితుల ఇళ్ల ముందు శవాల పుర్రెలు, ఎముకలు, కళేబరాలు వంటివి పడి భయాందోళనకు గురవుతున్నారు. దీంతో శ్మశాన స్థలాన్ని మార్చాలని డిమాడ్ చేస్తున్నారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు జరగకుండా అడ్డుకుంటున్నారు. ప్రభుత్వం కేటాయించిన స్థలం శ్మశానంలోనే అంత్యక్రియలు జరుపుకోవాలని కోరుతున్నారు.



ప్రభుత్వ శ్మశానంను కబ్జా చేసి సాగు చేసిన వరి పంట

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు మానవతా కోణంలో ఆలోచించి సమన్వయంతో భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా నేషనల్ హైవే, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ హైవేలో నిబంధనల ప్రకారం సైన్ బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్స్ తదితర చర్యలు తీసుకున్నారా? లేదా అని జాతీయ రహదారులపై సంబంధిత శాఖల అధికారులతో వెళ్లి పరిశీలించాలని ఆర్అండ్‌బీ ఎస్ఈని ఆదేశించారు. గ్రామాల నుంచి హైవేకి కనెక్ట్ అయ్యే అప్రోచ్ రోడ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు, గ్రిల్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పెద్దపాడు నుంచి హైదరాబాదు ఎన్‌హెచ్‌కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు 6.5 కిలోమీటర్ల కోసం భూసేకరణకు ఎంత ఖర్చు అయ్యేదీ నివేదిక సమర్పించాలని అడిషనల్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. రాజ్‌విహార్ వద్ద శాటిలైట్ బస్టాండు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ గ్రామాల నుంచి హైవేకి కనెక్ట్ అయ్యే అప్రోచ్ రోడ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు. నేషనల్ హైవేలపై కొన్ని బ్లింకర్లు లేవని, డార్క్‌గా ఉందని, మల్టీ కలర్ బ్లింకర్‌లు ఏర్పాటు చేయాలని, రేడియం, జిగ్‌జాగ్‌లను ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, డీటీసీ శాంతకుమారి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఏవో సింధు సుబ్రహ్మణ్యం, నేషనల్ హైవే పీడీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీలు

క్లస్టర్ బలోపేతానికి కీలక సూచనలు

ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపిన జిల్లా విద్యాశాఖ అధికారి

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ పరిధిలోని నూతన పాఠశాలల సముదాయాల నిర్వహణ బలోపేతానికి మార్గదర్శకాలు ప్రభుత్వం విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ మంగళవారం తెలిపారు. పాఠశాల సముదాయాల సమావేశం ప్రతి నెలా మూడో శనివారం మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు నిర్వహించాలని, ఒకవేళ మూడో శనివారం సెలవు దినం అయితే.. నాలుగో శనివారం నిర్వహించాలని అన్నారు. పాఠశాలల సముదాయాల సమావేశం రోజున అన్ని పాఠశాలల్లో ఖచ్చితంగా మధ్యాహ్నం 11.45 గంటలకు భోజనం కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. సమావేశాల రోజున మధ్యాహ్నం విద్యార్థులకు సెలవుగా ప్రకటించాలన్నారు. అనివార్య కారణాల వల్ల తప్ప మరే ఇతర కారణాల దృష్ట్యా ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయరాదన్నారు. ఉపాధ్యాయులు ఖచ్చితంగా బయోమెట్రిక్ హాజరు వేయడానికి రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ ఐటీ విభాగం తగిన ఏర్పాట్లు చేస్తుందన్నారు. మొదటి సమావేశం రోజున రాష్ట్ర విద్యాశాఖ మంత్రులు నారా లోకేశ్, పాఠశాలల విద్యాశాఖ కమిషనర్లు హాజరవుతారన్నారు. రెండు రోజుల ముందే పాఠశాలల సముదాయాల సమావేశాల్లో ఐఎఫ్‌టీలు అన్నీ పని చేసేలా, ఇంటర్నెట్ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో సమగ్ర శిక్ష ఎంఐఎస్ కోఆర్డినేటర్, మండల స్థాయిలో మండల విద్యాశాఖ అధికారులు ఎంఐఎస్ కోఆర్డినేటర్లు పర్యవేక్షించాలని అన్నారు. జిల్లాలోని అన్ని కాంప్లెక్స్ సముదాయాల పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి, ఉప విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్, సెక్టోరల్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు ఖచ్చితంగా సందర్శించాలని ఆయన సూచించారు.

బ్రహ్మోత్సవాల్లో ఆర్జిత సేవలు రద్దు

19 నుంచి 23 వరకు శివ దీక్షాపరులకు స్పర్శ దర్శనం

సున్నిపెంట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఆలయాలతో పాటు పరివార ఆలయాల్లో ఈ నెల 19 నుంచి మార్చి 3వ తేదీ వరకు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు ఈవో ఎం.శ్రీనివాసరావు ప్రకటించారు. ఈ నెల 19 శుక్రవారం నుంచి 23 బుధవారం వరకు మాత్రమే జ్యోతిర్ముడి కలిగిన శివ దీక్షాపరులకు మాత్రమే ఉచిత స్పర్శ దర్శనం ఉంటుందని ఈవో తెలిపారు. ఇక సాధారణ భక్తులకు ఈ నెల 19 నుంచి మార్చి 3 వరకు అలంకార దర్శనం మాత్రమే ఉంటుందన్నారు. బ్రహ్మోత్సవాల పర్వదినాల్లో ప్రముఖులకు ప్రత్యేక దర్శన వేళలు కేటాయించామన్నారు.

22న కడపలో ప్రాజెక్టుల మహాసభ

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో నీటిపారుదల ప్రాజెక్టులన్నీ సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న కడపలో ఏపీ రైతు సంఘం అధ్వర్యంలో ప్రాజెక్టుల మహసభ నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం మంగళవారం ఒక ప్రకట నలో తెలిపారు. కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుప నిచ్చారు. రాయలసీమ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టు లు పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై రాబోయే రోజుల్లో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తామని హెచ్చరించారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ


174

ఐదుగురు సీఐలకు స్థాన చలనం

-డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు

6

మన కోడి భద్రం..



ముందు జాగ్రత్తతో తప్పిన పెను ముప్పు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పశ్చిమగోదావరి తదితర జిల్లాల్లో వైరస్ కారణంగా కోళ్లు మరణిస్తుండటంతో పశుసంవర్ధకశాఖ అప్రమత్తమైంది. మిగతా జిల్లాలకు వ్యాప్తి చెందకుండా వెంటనే టీకాలు, వ్యాక్సినేషన్ వేయాలని ఆదేశించడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పౌల్ట్రిఫారాల్లో కోళ్లకు యుద్ధ ప్రాతిపదికన టీకాలు, వ్యాక్సినేషన్ వేసే కార్యక్రమం జరుగుతుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత నెలలోనే కోళ్లకు వ్యాక్సినేషన్, టీకా కార్యక్రమాన్ని చేపట్టారు. కర్నూలు జిల్లాలో 5.85 లక్షల కోళ్లు, నంద్యాల జిల్లాలో 7.5 లక్షల కోళ్లు ఉన్నాయి. ఈ కోళ్లకు టీకాలు, వ్యాక్సినేషన్ వేయడంతో ముప్పు తప్పిపోయింది. యధావిధిగా పౌల్ట్రి యజమాన్యాలు పశుసంవర్ధక శాఖ అధికారుల సూచనల మేరకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో ఎటువంటి ముప్పు లేకుండా యధావిధిగా గుడ్లు, మాంసం ఉత్పత్తులు జరుగుతుండటంతో యజమానులు ఊపిరి పీల్చుకుంటున్నారు. దీంతో మన ఉమ్మడి జిల్లా కోళ్లు, గుడ్లు భద్రంగా ఉన్నాయనీ, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కర్నూలు జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ శ్రీనివాస్ తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గుడ్లను ఉత్పత్తి చేసే కేంద్రాలు దాదాపు 40 దాకా ఉన్నాయి. ప్రతిరోజు ఈ పౌల్ట్రీ ఫారాల్లో లక్షల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఇతర ప్రాంతాల్లోని పౌల్ట్రీ ఫారాల ద్వారా మరో లక్ష గుడ్లు ఉమ్మడి కర్నూలు జిల్లాకు దిగుమతి చేసుకుంటున్నారు. వైరస్ ప్రభావం నేపథ్యంలో నిర్వహకులు ఫారాలను రసాయనాలతో పూర్తిస్థాయిలో శుభ్రం చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో జేడీ శ్రీనివాస్, అదే విదంగా నంద్యాల జిల్లాలో మోహన్ నాయక్ తమ అధికారులు, సిబ్బందితో నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యటించి పౌల్ట్రీ ఫారాల నిర్వాహకులకు తగిన సలహాలు, సూచనలు అందిస్తున్నారు. దీంతో మన జిల్లా కోళ్లు సురక్షితంగా ఉన్న పరిస్థితి ఏర్పడింది.

జిల్లాలో పరిస్థితి ఇలా

- మొత్తం పౌల్ట్రీలు : 250
- యజమానులు : 300
- కోడిగుడ్ల పౌల్ట్రీలు - 20
- గుడ్లు పెట్టే కోళ్లు - 2 లక్షలు
- ఏటా దిగుబడి - 3.20,56,500 గుడ్లు



వెంకాయపల్లె వద్ద కోళ్ల ఫౌల్ట్రీ

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

● జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పోషకాహార లోపంతో ఎదుగుదల లేని అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు పౌష్టికాహారం అందించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవుతారనీ జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో అంగన్‌వాడీ శిశువుల ఆరోగ్య పరిరక్షణ శిక్షణ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మలతో కలిసి జేసీ ప్రారంభించారు. పిల్లల వయస్సుకు తగ్గ బరువు, పొడవులను కొలిచి జాయింట్ కలెక్టర్‌కు సూపర్‌వైజర్లు, సీడీపీవో, అంగన్‌వాడీ కార్యకర్తలు చూపించారు. ఈ సందర్భంగా జేసీ డా.బి. నవ్య మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలతో పోల్చినప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలును, గర్భిణులు, బాలింతలకు మంచి పోషకాహారం అందిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ పిల్లల వయస్సు, పొడవు, బరువు సక్రమంగా రికార్డు చేసి పోషణ ట్రాకర్‌లో పొందుపరచాలని ఆదేశించారు. ఐసీడీఎస్ పీడీ నిర్మల మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది పిల్లల కొలతలు తీసుకుని అవి వారి వయస్సుకు తగ్గ విధంగా ఉన్నాయా లేదా పరీక్షించుకోవాలన్నారు. పిల్లల బరువు, పొడవులు కొలిచే సాధనాలైన ఇన్ఫేంటో, స్టిడో మీటర్ల ద్వారా ప్రత్యక్షంగా పిల్లల బరువు పొడవు కొలుచు విధానాన్ని వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో కోడుమూరు, వెల్దుర్తి, కర్నూలు ప్రాజెక్టులకు చెందిన సీడీపీవోలు వరలక్ష్మి, అనురాధ, మద్దమ్మ, బాలమ్మ, నరసమ్మ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న జేసీ



ఓరా.. సమీరా..!

సమీరా... ఓ ట్రాన్స్ జెండర్. చిన్నతనం నుంచే అవమానాలు, చీదరింపులు సమాజం వెలివేసేలా చిన్నచూపు. వీడేంట్రా మగోడిగా పుట్టి ఇలా ప్రవర్తిస్తున్నాడంటూ అసహ్యించుకునేవారు. చివరకు తల్లిదండ్రులు సైతం సమీరాను దూరం పెట్టేశారు. అందరిలా సమీరా కుంగిపోలేదు. అనుకున్నది సాధించాలనుకుని ఇష్టమైన రంగంలో రాణించాలని భావించింది. ఏడాది పాటు అమానాల కన్నీటిని దిగమింగి డాన్స్ నేర్చుకుంది. చెక్కభజనకు కేరాఫ్‌గా నిలిచింది. ఎవరైతే విమర్శించారో వాళ్లే ఔరా సమీరా.. శభాష్ సమీరా అంటూ ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. అవమానాలను భరించి అమెరికా దాకా ఆమె ప్రస్థానం సాగిన తీరు ఎంతోమందికి ఆదర్శనీయం.

-వివరాలు 6 లో



నంది అవార్డుతో సమీరా

జైరా.. సమీరా..!

- చెక్కభజనలో మేటి
- రెండు డాక్టరేట్లు, నంది అవార్డులు సొంతం
- విమర్శించిన వారే ప్రశంసలు
- అవమానాలను ఎదుర్కొని ఆదర్శంగా నిలిచి..
- అనుకున్నది సాధించిన ట్రాన్స్ జెండర్

కళ



చెక్కభజన ఆడుతున్న సమీరా

మానసికంగా, సమాజంలో ఒక కనీస గుర్తింపు కోసం తపన పడుతున్న ట్రాన్స్ జెండర్లు ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్నారు. అన్ని రంగాల్లో తామేంటో నిరూపించుకుంటున్నారు. నిజానికి చాలా మందిలో ట్రాన్స్ జెండర్లు అంటే ఓ చులకనభావన ఉంటోంది. చీరలు, చప్పట్లు, కరుకుగా ఉండే గొంతుకలు.. దారిన వెళ్తుంటే ఆపి డబ్బులు డిమాండ్ చేస్తూ చికాకు పెడుతుంటారని చాలా మంది అనుకుంటుంటారు. నిజానికి లింగ సమానత్వంలో మహిళలు తమ హక్కుల కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తూనే ఉన్నారు. కానీ ట్రాన్స్ జెండర్లకు కూడా హక్కులు ఉంటాయని, వాటి కోసం పోరాటం చేయాలన్న ఆలోచన రావడానికే చాలా సమయం పట్టింది. ఈ క్రమంలో ట్రాన్స్‌జెండర్లు వివిధ రంగాల్లో రాణిస్తూ ఔరా అనిపించుకుంటున్నారు. ఇదే కోవకు చెందిన వారే తుగ్గలి మండలం గుండాల్‌తండాకు చెందిన డాన్సర్ సమీరా. జీవితంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా తన గమ్యాన్ని చేరేందుకు అహర్నిశలు కృషి చేసిన ఆమె స్వయంకృషితో చెక్కభజన నేర్చుకుని అదే తన వృత్తిగా ఎంచుకుంది. ఉత్తమ ప్రతిభ కనబరిచి ట్రాన్స్‌జెండర్ సమీరా నుంచి డ్యాన్సర్ సమీరాగా ఎదగడమే కాకుండా డాక్టరేట్లు, నంది అవార్డులు కూడా పొంది విమర్శకుల నుంచే ప్రశంసలు పొందుతోంది.

తుగ్గలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తుగ్గలి మండలం గుండాల్‌తండాకు చెందిన షెనావత్ సుబ్బరాయుడు నాయక్, గోవిందమ్మబాయి దంపతులకు ఇద్దరు కవలలు. వారిలో ఒకరైన సమీరా 14 ఏళ్ల వయస్సులో ఇంటిలో నుంచి వెళ్లి ట్రాన్స్‌జెండర్‌గా మారాలని నిర్ణయించుకుంది. అయితే అప్పుడు గ్రామస్థులు, బంధువులు, కుటుంబ సభ్యులను హేళనగా చూడటంతో పాటు అసహ్యించుకున్నారు. చుట్టుపక్కలవారి విమర్శలతో విసుగెత్తిన తల్లిదండ్రులు కూడా సమీరాను దూరంగా ఉంచారు. అదే కసితో ట్రాన్స్‌జెండర్‌గా మారిన సమీరా.. ఎలాంటి అసాంఘిక కార్యకాలపాలు, భిక్షాటన వంటివి చేయకుండా తనకు ఇష్టమైన డ్యాన్స్‌నే కళగామార్చుకుంది. ఎంతో కష్టపడి చెక్కభజనలో మెలకువలు పొందింది. ఏడాదిపాటు శిక్షణా కార్యక్రమాలకు వెళ్తూ పలువురి మాస్టర్లతో డ్యాన్సులు నేర్చుకుంది. మారుమూల గిరిజన గ్రామాల్లో పుట్టి.. ట్రాన్స్‌జెండర్‌గా మారి చీదరించుకున్న కుటుంబ సభ్యులు, బంధువు ఆమె స్వయంకృషి, పట్టుదలే శభాష్ అనిపించుకునేలా చేసింది.

డ్యాన్స్‌కు అవార్డుల పంట



నంది అవార్డు తీసుకుంటున్న సమీరా

సమీరా చెక్కభజనలో చేస్తున్న డ్యాన్సుల నుంచి 2023లో ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమి సంస్థ సమీరాకు గౌరవ డాక్టరేట్‌ను అందించి సత్కరించారు. అలాగే అమెరికన్ రిసమ్ ఫేస్ యూనివర్సిటీ నుంచి 2024లో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. అంతేగాకుండా 2024లోను ఆదర్శ కళా నిలయం నుంచి నంది అవార్డు కూడా అందుకున్నారు. అంతేగాకుండా గోవాలో నేషనల్ అవార్డు అందుకున్నారు. ఇలా మరెన్నో అవార్డులు అందుకుని ప్రశంసలు అందుకుంది.

ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ప్రదర్శన

చెక్కభజన కార్యక్రమాలను ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల్లో కూడా చెక్కభజన కార్యక్రమాలు నిర్వహించింది. ఇప్పటికే వేల సంఖ్యలో కార్యక్రమాలు చేస్తూ డ్యాన్స్ అంటే తనకు ప్రాణమని చాటి చెప్పింది. సమీరా డ్యాన్స్ చేయడంతో పాటు పలువురికి డ్యాన్స్ కూడా నేర్పిస్తూ వస్తుంది. అంతేకాకుండా చెక్కభజన కార్యక్రమాలు చేయడంలో వచ్చిన ఆదాయాన్ని కుటుంబ పోషణతో పాటు వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలకు ఇవ్వడంతో పాటు వెనుకబడిన గిరిజనులకు కూడా తన వంతు ఆర్థిక సాయం అందిస్తూ ట్రాన్స్‌జెండర్లకు సైతం సహాయ సహకారాలు అందిస్తూ వస్తోంది.

డ్యాన్స్ అంటే ప్రాణం

నాకు చిన్నప్పటి నుంచి డ్యాన్స్ చేయడం ఇష్టం. ఆ డ్యాన్స్‌ను ప్రవృత్తిగా ఎంచుకుని కార్యక్రమాలు చేస్తూ వస్తున్నాను. మొదట్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా కొన్ని కార్యక్రమాల్లో ట్రాన్స్ జెండర్‌తో ఏంటి కార్యక్రమాలు చేయించేది అన్న విమర్శలు కూడా వచ్చాయి. వాటన్నింటిని తట్టుకుని ఒక ఫేమస్ చెక్కభజన డ్యాన్సర్‌గా ఎదిగాను. నా కృషిలో సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటాను. ముఖ్యంగా నన్ను ఆదరిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు. నేను జీవించిన కాలం డ్యాన్స్ చేస్తూనే ఉంటాను. వచ్చిన ఆదాయంలో కొంత పేదలను ఆదుకోవడానికి ఖర్చు చేస్తా. ఇలా సేవా కార్యక్రమాలు చేయడం తనకెంతో సంతృప్తినిచ్చింది.

- సమీరా, గుండాల్‌తండా, తుగ్గలి మండలం

డాక్టరేట్ తీసుకుంటూ...



చెట్నహాల్లి.. శ్మశాన లొల్లి..!



జగనన్న కాలనీ సమీపంలో పడివున్న పుర్రె, అస్థికలు

(5వ పేజీ తరువాయి)

అయినా ఖాతరు చేయకపోవడంతో శ్మశానానికి వెళ్లే దారి లేక అవస్థలు పడుతున్నారు. వరిమళ్లను దాటుకుంటూ శ్మశానానికి వెళ్లి అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నారు.

126 సర్వే నెంబరులోనే శ్మశాన స్థలం

ప్రభుత్వ ఆర్‌ఎస్ఆర్ రికార్డుల పరంగా చెట్నహల్లి గ్రామంలో 126 సర్వే నెంబరులో 3.54 ఎకరాల భూమిని శ్మశాన కోసం కేటాయించారు. గ్రామస్థులంతా అక్కడే అంత్యక్రియలు జరుపుకోవాలి. రానురాను శ్మశానం, దారి కబ్జాకు గురి కావడం, ఊరికి దూరంగా ఉండటంతో పట్టించుకోలేదు. గ్రామానికి ఆనుకుని రస్తా పోరంబోకు స్థలంలో అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నారు. గ్రామం మధ్యలో శ్మశానం ఉండటం సరికాదని, ఇరువర్గాలు సరైన నిర్ణయం తీసుకొని సమస్య పరిష్కారానికి సహకరించాలి.



- ఎస్.రవి, తహసీల్దార్, మంత్రాలయం

వదిలే ప్రసక్తే లేదు



ప్రభుత్వ రస్తా పోరంబోకును తరతరాలుగా శ్మశానం వాటిక కింద ఉపయోగించు కుంటున్నాం. జగనన్న కాలనీ పేరుతో శ్మశానాన్ని రద్దు చేయాలని చూస్తే సహించేది లేదు. శ్మశానాన్ని వదులుకునే ప్రసక్తే లేదు. ప్రభుత్వం గ్రామానికి ఆనుకొని ఉన్న రస్తా పోరంబోకు స్థలానికి ప్రహరీ కట్టించి అన్ని కులాలకు ఇక్కడే శ్మశాన స్థలంగా ఉంచాలి.

- చాపల నగేష్, గ్రామస్థుడు, చెట్నహల్లి



అంత్యక్రియలకు వరిచేను మధ్యలో మృతదేహన్ని తీసుకెళ్తున్న దృశ్యం (ఫైల్)

ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే నిర్వహించాలి



ప్రభుత్వం కేటాయించిన 126 సర్వేలో అన్ని కులాల వారు అంత్యక్రియలు చేసుకోవాలి. కబ్జాకు గురైన స్థలాన్ని విడిపించి రహదారి నిర్మించాలి. జగనన్న కాలనీకి ఇచ్చిన దళిత కుటుంబాల మధ్య అంత్యక్రియలు చేయడం సరికాదు. కళేబరాలు, పుర్రెలు మా ఇళ్ల ముందుకు పడేస్తే పిల్లలు, పెద్దలు భయందోళనలకు గురవుతున్నారు. శ్మశానాన్ని ఇక్కడి నుంచి మార్చే వరకు పోరాడుతాం.

- తగరం ప్రసాద్, గ్రామస్థుడు, చెట్నహల్లి

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



చెట్నహల్లి శ్మశాన వివాదంలో ఇరువర్గాల మధ్య జరుగుతున్న వివాదంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు. ఇప్పటికే ఎస్సీల ఫిర్యాదు మేరకు 50 మంది బీసీలపై, బీసీల ఫిర్యాదు మేరకు 32 మంది ఎస్సీలపై కేసులు నమోదు చేశాం. బీసీలు 32, ఎస్సీలు 32 మంది కలిపి మొత్తం 64 మందిపై 107 సెక్షన్ కింద ఆదోని సబ్ కలెక్టర్‌కు బైండోవర్‌కు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదు.

- శివాంజల్, ఎస్ఐ, మంత్రాలయం

'నవోదయం'ను విజయవంతం చేయండి

ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ సీఐలతో డిప్యూటీ కమిషనర్

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలన కోసం నవోదయం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి సూచించారు. మంగళవారం నంద్యాల, కర్నూలు ఎక్సైజ్ సీఐలు, ఈఎస్‌లతో సమీక్షించారు. సారా, బెల్టు షాపులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ ఆదాలత్‌లో పరిష్కరించుకోవాలని ఆదేశించారు. రెండు జిల్లాలో మద్యం దుకాణాల వద్ద ధరల పట్టికలను ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. శివరాత్రి పండుగ సందర్భంగా స్పెషల్ డ్రైవ్ చేసి అక్రమ మద్యం, సారా వంటి వాటిని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశించిన లక్ష్యలను గడువు లోపు పూర్తి చేయాలని, ఆలాగే గీతా కులాల మద్యం దుకాణాల ఏర్పాటుకు అవసరమైన ప్రక్రియను తర్వాతగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఐదుగురు సీఐలకు స్థాన చలనం

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ పరిధిలో ఐదుగురు సీఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు వారిని బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సీఐల వివరాలు ఇలా..

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎల్.విజయలక్ష్మి	డీటీఆర్‌బీ, కర్నూలు	మహిళా పీఎస్-1, కర్నూలు
ఎం.ఆదిలక్ష్మి	మహిళా పీఎస్-1, కర్నూలు	డీటీఆర్‌బీ, కర్నూలు
పి.రాజా	సీసీఎస్-2, నంద్యాల	రాజంపేట, అన్నమయ్య జిల్లా
కే.ఎల్లమరాజు	రాజంపేట, అన్నమయ్య జిల్లా	వీఆర్, అన్నమయ్య
ఏ.సత్యనారాయణ	ఎస్‌బీ-2, అన్నమయ్య	మదనపల్లి రూరల్

అహోబిలంలో హీరో సాయిధరమ్ తేజ్



దిగువ అహోబిలంలో సినీ హీరో సాయి ధరమ్ తేజ్

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో సినీ హీరో సాయి ధరమ్ తేజ్ మంగళవారం సందడి చేశారు. అహోబిలం చేరుకున్న ఆయనకు జనసేన ఆళ్లగడ్డ నియోజకవర్గ సమన్వకర్త మైలేరి మల్లయ్య స్వాగతం పలికారు. ఎగువ అహోబిలంలోని జ్వాలా నరసింహస్వామి, దిగువ అహోబిలం లోని ప్రహ్లాదవరదస్వామిని సాయిధరమ్ తేజ్ దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాచీన చరిత్ర కలిగిన లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సరైన లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. రాజకీయాలు అంటే ఈజీ కావని.. సినిమాల నుంచి దూరం కాకుండా ప్రేక్షకులను నవ్వించడమే తన ధ్యేయమన్నారు. ప్రస్తుతం సంబరాల్లో ఏటిగట్టు సినిమా షూటింగ్ జరుగుతోందన్నారు. అవకాశం వస్తే మెగాస్టార్ చిరంజీవితో కలిసి సినిమాలో నటిస్తానని సాయిధరమ్ తేజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు అంజి, రాము, ప్రేమ్ కుమార్, వెంకట సుబ్బయ్య, నరేంద్ర యాదవ్, ఆంజనేయులు, రవి పాల్గొన్నారు.

తెలుగు వారి హృదయాల్లో ఘంటసాల స్థానం శాశ్వతం

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- ముగిసిన ఘంటసాల ఆరాధనోత్సవాలు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావుకు తెలుగు వారి హృదయాల్లో శాశ్వత స్థానం ఉంటుందని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఘంటసాల 51వ వర్ధంతి సందర్భంగా మూడు రోజులుగా నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగిన 'ఘంటసాల ఆరాధనోత్సవాలు' మంగళవారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా టీజీ వెంకటేశ్, గౌరవ అతిథులుగా పారిశ్రామికవేత్త, చిత్ర నిర్మాత బీవీ రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య హాజరయ్యారు. ఘంటసాల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హైదరాబాదుకు చెందిన ఘంటసాల గానసభ అధ్యక్షుడు కేవీ రావు రచించిన 'ఘంటసాల - రాగశాల' పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. అలాగే 'ఘంటసాల జీవిత చరిత్ర'పై రూపొందించిన డాక్యుమెంటరీ చిత్రాన్ని సభలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఘంటసాల మాస్టారు తన మధురమైన గాత్రంతో వేలాది పాటలు పాడి తెలుగు వారి మనస్సుల్లో సుస్థిర స్థానం పొందారని అన్నారు. ఇప్పటికీ ప్రతి పల్లెలోనూ ఘంటసాల పాటలు, ఆయన ఆలపించిన భగవద్గీత మారుమోగుతూనే ఉంటాయని చెప్పారు. చిత్ర నిర్మాత బీవీ రెడ్డి మాట్లాడుతూ ఘంటసాల పాటను తెలుగు శ్రోతలు ఎవరూ మర్చిపోలేరని, ఆ గాత్రానికి ఆ శక్తి ఉందని అన్నారు.

- **అలరించిన సంగీత విభావరి :** ఘంటసాల ఆరాధనోత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం రాత్రి నిర్వహించిన అలనాటి ఘంటసాల పాటల సంగీత విభావరి ప్రేక్షకులను ఆసాంతం అలరింపజేసింది. సుప్రసిద్ధ గాయకులు వాణికుమారి, వీరలక్ష్మి, పి.రవీందర్, డాక్టర్ వీఎస్ మూర్తి, డాక్టర్ సతీష్‌ల బృందం ఎంపిక చేసిన పాటలతో అలరించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ గాయకులను శాలువలు కప్పి, జ్ఞాపికలు అందజేసి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఐజయ్య, డీఎస్పీలు సుధాకర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, త్రీటౌన్ సీఐ శేషయ్య, కాపు సంఘం నాయకుడు ఆర్జా రామకృష్ణ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేజీ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు. కళాక్షేత్రం సభ్యులు ఎస్ఎండీ ఇనాయతుల్లా, సీవీ రెడ్డి, పీపీ గురుమూర్తి, బాలవెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, యాగంటీశ్వరప్పలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్‌తో సత్కారం పొందిన గాయకులు

చెంచుల ఇళ్లకు రుణాలు : ఎమ్మెల్యే



ఇందిరానగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత, కలెక్టరు

పాణ్యం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నిర్మాణానికి చెంచులకు రూ. లక్ష వరకు రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత తెలిపారు. మంగళవారం పాణ్యంలోని ఇందిరానగర్‌లోని చెంచుల గృహాలను ఆమె కలెక్టరు రాజకుమారితో పాటు సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇందిరానగర్‌లోని 167 కుటుంబాలకు గృహాలు మంజూరయ్యాయన్నారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి రూ. 2. 39 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. పొదుపు గ్రూపు మహిళలకు రూ.35 వేలనుంచి రూ. లక్ష వరకు రుణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఇందిరానగర్‌లో ఇప్పటికే 10 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని అన్నారు. కాలనీలో ఇల్లు నిర్మించుకుంటే రోడ్లు, కాల్వలు, తాగునీటి వసతి, వీధి లైట్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలకు 67 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం విద్యార్థులు 4350 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 4222 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 127 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్స్‌కు 67 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం విద్యార్థులు 3848 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 3789 మంది పరీక్షకు హాజరు కాగా, 59 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో కన్వీనర్ గురువయ్య శెట్టి, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, డీఈసీ సభ్యులు నాగభూషణం రెడ్డి, పద్మావతి, స్క్వాడ్ బృందాల సభ్యులు పర్యవేక్షించారు.

'మద్దతు ధర ఇవ్వాలి'

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో పంట దిగుబడులకు మద్దతు ధర ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు మార్కెట్ యార్డులో గిట్టుబాటు ధరలు అందుతాయనే ఆశతో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచే కాకుండా పక్క రాష్ట్రాలు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి రైతులు పంట ఉత్పత్తులను కర్నూలు మార్కెట్ యార్డుకు తెస్తున్నారని, అయితే.. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అందడం లేదని అన్నారు. పైగా కమిషన్ ఏజెంట్లు, వ్యాపారుల అక్రమాలకు తెర పడడంలేదని ఆరోపించారు. ఇదే పరిస్థితి ఇకపై కొనసాగితే రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికైనా మార్కెట్ యార్డు అధికారులు తూకాల వద్ద నిఘా పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల - పాణ్యం రైల్వే స్టేషన్ల మధ్యలో కేఎం నెం.261/01-261/02 పోస్టుల మధ్యన రైలు పట్టాల పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం ఉదయం 10:30గంటల ప్రాంతంలో లభ్యమైనట్లు రైల్వే ఎస్ఐ ఎస్.అబ్దుల్ జలీల్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 30 ఏళ్లు ఉంటుందని, ప్రమాదవశాత్తూ రైలులో నుంచి కిందపడి మరణించి ఉండవచ్చని చెప్పారు. మృతుడు నల్లటి టీ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని, నడుముకు బ్రౌన్ కలర్ లెదర్ బెల్ట్ పెట్టుకొని ఉన్నాడని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు నంద్యాల రైల్వే పోలీసులను 9440627653, 9441509497 నెంబర్లను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

'స్వచ్ఛ్ దివస్'ను పకడ్బందీగా నిర్వహించాలి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మూడో శనివారం స్వచ్ఛ దివస్‌ను పండుగ వాతావరణంలా నిర్వహించాలని జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జడ్పీ నుంచి ఆయన ఎంపీడీవోలు, డీపీఆర్‌సీ అధికారులతో జీఎస్‌డబ్ల్యూ, ఎస్‌బీఎం యాక్టివిటీస్‌పై వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. మిస్సింగ్ సిటిజెన్స్, హౌస్ మ్యాపింగ్, ఎన్‌పీసీఐ యాక్షన్, ఈకేవైసీ తదితర అంశాలపై సూచనలు జారీ చేశారు.

ఇసుక ట్రక్ ఢీకొని వ్యక్తి మృతి

సి.బెళగల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందారు. వివరాలివీ.. మండలంలోని గుండ్రేవుల గ్రామానికి చెందిన పెద్ద సోమన్న(50), కుమారుడు రంగస్వామి ఇద్దరు కలిసి మోటార్ సైకిల్‌పై గద్వాల దేవరకు బయలుదేరారు. పోలకల్లు చింతాలమునిస్వామి దేవాలయం దగ్గర ఎదురుగా వస్తున్న ఇసుక ట్రక్ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో పెద్దసోమన్న ట్రక్ టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ తిమ్మారెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డ్రైవర్ క్రిష్ణగిరి మండలానికి చెందిన చిన్న రాముడుగా గుర్తించారు. పెద్ద సోమన్నకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుమారుడు రంగస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నంద్యాలలో చైన్ స్నాచింగ్



బాధితురాలు ఆదిలక్ష్మి

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోటవీధిలో బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలోని చైన్ అపహరించుకుని పరారయ్యారు. వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి, బాధితురాలు ఆదిలక్ష్మి తెలిపిన మేరకు వివరాలు... డోన్‌కు చెందిన ఆదిలక్ష్మి పట్టణంలోని జగజ్జననీదేవి ఆలయాన్ని సందర్శించేందుకు నంద్యాలకు చేరుకున్నారు. మంగళవారం అమ్మవారిని దర్శించుకుని బంధువుల ఇంటికి బయల్దేరింది. మార్గమధ్యంలో కోటవీధిలో నడుస్తూ వెలుతున్న ఆదిలక్ష్మి వెనుకవైపు నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు అగంతకులు మహిళ మెడలోని ఐదు తులాల గొలుసును లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఆప్కాస్‌ను రద్దు చేస్తారా?

ఆలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్సింగ్‌ను రద్దు చేసి ఏజెన్సీల ద్వారా పాత విధానంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఏజెన్సీల పరిధిలోకి తీసుకు రావాలని రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇది జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సంఘాల రెండు రోజులుగా వాట్సాప్ గ్రూప్‌లో సోషల్ మీడియాలో పోస్టు పెడుతున్నారు.

- ఏజెన్సీల ద్వారా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకానికి కసరత్తు
- అయోమయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు
- ఆయా శాఖల నుంచే జీతాలు చెల్లింపులకు యూనియన్ల డిమాండ్

● పాత విధానం తీసుకొచ్చే యోచనలో ప్రభుత్వం

ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు ప్రైవేటు ఏజెన్సీల ద్వారా చేపట్టేవారు. అయితే మితిమీరిన రాజకీయ జోక్యం వల్ల అర్హులకు న్యాయం జరిగేది కాదు. అడ్డగోలుగా మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులతో నియామకాలు జరిగేవి. దీంతో ఏజెన్సీలు సకాలంలో వేతనాలు చెల్లించక ఈపీఎఫ్ సక్రమంగా ఖాతాల్లో జమ చేయాక ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు తీవ్ర నష్టం జరిగేది. రాజకీయ సిఫార్సులతో ఉద్యోగులను తొలగించిన సంఘటనలు ఉన్నాయి.

● ఒకే గొడుగు క్రిందకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

గత ప్రభుత్వంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి ఆంధ్రప్రదేశ్ ఔట్ సోర్సింగ్ ఫర్ కార్పొరేషన్ (ఆప్కాస్) విధానాన్ని తీసుకొచ్చి ప్రతి నెల 1 నా వేతనాలు నేరుగా ఉద్యోగుల ఖాతాలో జమచేసి వేతనానికి ముందే ఈపీఎఫ్ కూడా సక్రమంగా జమ చేసే ప్రక్రియను శ్రీకారం చుట్టారు.

● ఆప్కాస్ రద్దుతో ఉద్యోగుల్లో ఆందోళన

ఆప్కాస్ విధానం రద్దు చేస్తామని ప్రభుత్వ నిర్ణయంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఏళ్ల తరబడి ఉద్యోగాలు చేస్తున్న వారిలో సందిగ్ధం నెలకొంది. ఉద్యోగాలు ఉంటాయా ఊడుతాయా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల్లో వివిధ ప్రభుత్వ శాఖల్లో 20 వేలకు పైగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు.

● కాంట్రాక్టు విధానమే ఉద్యోగులకు మేలు

ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసినా అందులో ఉన్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టర్ పరిధిలోకి తీసుకువచ్చి నేరుగా ఆయా శాఖల హెచ్‌వోడీల ద్వారా జీతాలు చెల్లిస్తే ఉద్యోగులకు మేలు జరుగుతుందని, ఉద్యోగ భద్రత కలుగుతుందని ఉద్యోగుల అభిప్రాయం. ఆ దిశగా ప్రభుత్వం పునరాలోచించాలని యూనియన్ నాయకులు కోరుతున్నారు.



ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టు విధానంలోకి మార్పు చేయాలని స్టేట్ సమగ్ర శిక్ష అధికారి దేవానంద్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు(ఫైల్)

● కాంట్రాక్టు పరిధిలోకి తీసుకురావాలి

కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుచేసి పాత విధానం ద్వారా ఏజెన్సీల ప్రజల్లోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది. ఇలా చేస్తే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారు. మితిమీరిన రాజకీయ జోక్యంతో ఉద్యోగగ భద్రత పోతుంది. ఈపీఎఫ్ డబ్బులు గతంలో ఏజెన్సీలు ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయకుండా దిగమింగిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ప్రభుత్వం మరోసారి పునరాలోచించి ఔట్సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ పరిధిలోకి తీసుకువచ్చి నేరుగా ఆయా శాఖ అధిపతుల ద్వారా ప్రతినెల జీతాలు చెల్లించేలా చర్యలు చేపడితే ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు మేలు జరుగుతుంది

\- ముహమ్మద్ రఫీ, ఏపీ కాంట్రాక్టు,
ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర నాయకుడు

APCOS ఉపాధి

● అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీవితాలతో చెలగాటం తగదు

ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడేందుకు అప్కాస్‌ను రద్దు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. దీని వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న రెండు లక్షల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. సంస్థలకు వారిని అప్పజెప్పాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే ఉద్యోగ భద్రత కరువు అవుతుంది. ఒకవేళ అప్కాస్ విధానం రద్దు చేయాలనుకుంటే అందులో ఉన్న ఉద్యోగులందరినీ కాంట్రాక్ట్ పరిధిలోకి తీసుకురావాలి.

\- రమేష్‌బాబు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి

డి.బెళగల్ నుంచి జపాన్‌కు...

- ల్యాగ్రోస్ క్రీడలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన హుశేన్‌సాబ్
- పేదింటి నుంచి ఎదిగిన వైనం
- దాతలు ఆదుకోవాలి .. క్రీడాకారుడి విజ్ఞప్తి



జాతీయ ల్యాగ్రోస్ జట్టులో తేటి క్రీడాకారులతో హుశేన్ సాబ్



అంతర్జాతీయ ల్యాగ్రోస్ క్రీడకు ఎంపికైన డి.బెళగల్ గ్రామానికి చెందిన హుశేన్ సాబ్

కోసిగి, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని డి. బెళగల్ గ్రామానికి చెందిన పింజారి రసూల్ సాబ్, చాంద్‌బీ రెండో కుమారుడు హుశేన్ సాబ్ డిగ్రీ చదువుతున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ల్యాగ్రోస్ క్రీడ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టులో మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామంలో రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి ల్యాగ్రోస్ క్రీడ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హుశేన్ సాబ్‌ను అంతర్జాతీయ స్థాయి ల్యాగ్రోస్ పోటీలకు ఎంపికైనట్లు జాతీయ ల్యాగ్రోస్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ నెల 17న జపాన్ దేశంలో జరిగే భారతదేశం ల్యాగ్రోస్ క్రీడా జట్టు తరపున హుశేన్‌సాబ్ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. అయితే హుశేన్ సాబ్ పేదింటి కుటుంబం కావడంతో ఆ దేశంలో క్రీడల్లో పాల్గొనేందుకు సుమారు రూ.2లక్షల దాకా ఖర్చు వస్తుందని, దాతలు ఎవరైనా ఆదుకుంటే అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణిస్తానని క్రీడాకారుడు హుశేన్ సాబ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు, దాతలు సహకరించి తనకు ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కిస్తే అంతర్జాతీయ క్రీడాస్థాయిలో రాణించి దేశానికి మంచి పేరు తెస్తానని హుశేన్ సాబ్ తెలిపారు. హుశేన్‌సాబ్ అంతర్జాతీయ క్రీడలకు ఎంపిక కావడం పట్ల కోసిగి మండల ప్రజలు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు. డీ.బెళగల్ గ్రామానికి చెందిన యూత్ ఆధ్వర్యంలో క్రీడాకారుడికి తమకు తోచినంత సాయం అందజేస్తామని తెలిపారు.

ఆ చట్టాలను రద్దు చేయడం సరికాదు

- ఏపీడబ్ల్యూజేఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కుల కోసం ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేయడం సరికాదని, తక్షణం కార్మిక చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జి. ఆంజనేయులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో ప్రభుత్వాలు జర్నలిస్టులపై కక్షలు కట్టి అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. దేశంలో చాలా రాష్ట్రాలు జర్నలిస్టులకు పెన్షన్ పథకం అమలు చేస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కూడా పెన్షన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి టి. మద్దిలేటి, రాష్ట్ర నాయకులు బి. గోరంట్లప్ప, కేబీ శ్రీనివాసులు పాల్గొన్నారు.



భక్తులతో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ



వెంకటాపురం సమీప ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కాలినడకన వచ్చే భక్తులకు ఏర్పాట్లు

కలెక్టర్ జి.రాజకుమారి

సున్నిపెంట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వేల సంఖ్యలో కాలినడకన వచ్చే భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. మంగళవారం వెంకటాపురం నుండి వస్తున్న భక్తులను కైలాస ద్వారం వద్ద కలిసి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కైలాసద్వారం నుండి అటవీమార్గంలోని తుమ్మలబైలు, పెచ్చెరువు, నాగలూటి గూడెం, వెంకటాపురం వరకు కలెక్టరు ప్రయాణించారు. ఈ ప్రదేశాలలో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వెంకటాపురం నుండి కైలాస ద్వారం వరకు 46 కిమీ ప్రయాణించ వలసి వుంటుందని, ఇప్పటికి 12 ప్రదేశాలు గుర్తించి ఆ ప్రదేశాలలో భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక పందిళ్లు, భోజన వసతి, తాగు నీరు, వైద్య సదుపాయాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా వుండాలని అన్నారు. అంబులెన్సులను, వైద్య పరికరాలను సిద్ధం చేసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జాయింటు కలెక్టర్ విష్ణుచరణ్, ఎస్పీ ఆధిరాజ్ సింగ్ రాణా, దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, డీఎఫ్ఓ అబ్దుల్ రవూఫ్ తదితరులు ఉన్నారు.

'కారుణ్య నియామకాలు చేపట్టాలి'



మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి శాఖలో కారుణ్య నియామకాలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ పి.రంజిత్ బాషాకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయ ఉద్యోగులు ఎంతో నష్టపోయారన్నారు. అంతేగాకుండా ఉద్యోగులను మానసికంగా వేధింపులకు గురి చేశారని ఆరోపించారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగ పెన్షనర్లకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తే వైసీపీ ప్రభుత్వం తనపై తప్పుడు కేసులు బనాయించడంతో పాటు నా కుటుంబాన్ని అనేక ఇబ్బందులకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులపై నమోదైన తప్పుడు కేసులను కూటమి ప్రభుత్వం ఎత్తివేయాలన్నారు. ఉద్యోగుల సర్వీసు సమస్యల పరిష్కారం కోసం అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరారు. 12వ పీఆర్సీ పై త్రిసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, నగర అధ్యక్షుడు మురళీధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్ డెలివరీకి అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి. నవ్య

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11(ఆంధ్ర జ్యోతి): సిలిండర్ డెలివరీకి అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవని గ్యాస్ ఏజెన్సీలను హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీల సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలోని పలు గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్ డెలివరీ చేసే సమయంలో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఏ వినియోగదారుల నుంచి డీలర్ అదనంగా వసూలు చేయకూడదన్నారు. ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా ఫిర్యాదులు అందిన 24 ఏజెన్సీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు. వారి వివరణ ఆధారంగా గ్యాస్ ఏజెన్సీలపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఎస్‌వో రాజా రఘువీర్, ఓఎంసీ జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్, గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవికి పట్టు వస్త్రాల సమర్పణ



అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కోడుమూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌడేశ్వరీ దేవి జాతరను పురస్కరించుకొని టీడీపీ నాయకులు బడెసాగౌడ్ ఆధ్వర్యంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మంగళవారం అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. స్థానిక బృందావనం హోటల్ నుంచి ఊరేగింపుగా తేరు బజారులోని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. దేవాంగ దైవాచార సంఘం సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం అమ్మవారికి ఎమ్మెల్యే పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్, ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు టీడీపీ నాయకులు గోపాల్‌నాయుడు, రవీంద్రగౌడ్, బ్రిటీష్ రాముడు, మునిస్వామి, నారాయణ, కృష్ణ, మధు, రాముడు, బాలకిట్టు పాల్గొన్నారు.

సంజీవయ్య జయంతిని నిర్వహించాలి



డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న బీటీఏ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 104వ జయంతిని విద్యాశాఖ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలలో నిర్వహించాలని ప్రభుత్వాన్ని బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు డీఈవో కార్యాలయంలో డీఈవో శ్యామ్యూల్ పాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీటీఏ జాతీయ ప్రధాన కార్యదర్శి రామశేషయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి 14న అన్ని పాఠశాలలో దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించాలన్నారు. డీఈవోకు వినతి పత్రం సమర్పించిన వారిలో పెరికల రంగస్వామి, మహేష్ ఉన్నారు.

వలసలను నివారించాలి

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో పనులు లేక ప్రజలు వలస బాట పడుతున్నారని, వాటిని నివారించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ సమన్వయకర్త అనంత రత్నం మాదిగ మంగళవారం ఒక ప్రకటన కోరారు. జిల్లాలో పనులు లేక పక్క రాష్ట్రాలకు ప్రజలు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు జిల్లాలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వలసలు నివారించి, వేదవతి, గురురాఘవేంద్ర ప్రాజెక్టులను నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

సురక్షిత మాతృత్వ కార్యక్రమం వినియోగించుకోండి

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతి నెల 9న ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమం కింద ఉచితంగా చేసే షుగర్, బ్లడ్ గ్రూపింగ్, హెచ్‌బీ టెస్టులను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సంచార చికిత్స కార్యక్రమం నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. మంగళవారం గార్గేయపురం పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వైద్యసిబ్బంది గర్భిణులను గుర్తించి ప్రారంభ దశ నుంచి ప్రసవమయ్యే వరకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతరం గర్భిణులకు ఆయన ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్ర మంలో వైద్యాధికారులు హేమలత, అబ్దుల్ హమీద్, ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ, స్టాఫ్ నర్సులు నిర్మలారాణి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సు ఫీజు సకాలంలో చెల్లించాలి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలోని వ్యాపారులు ట్రేడ్ లైసెన్సు ఫీజును సకాలంలో చెల్లించాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి లైసెన్సు ఫీజును ఈనెల 28వ తేదీలోగా చెల్లించి సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. మార్చి ఒకటి తరువాత చెల్లించిన వారికి 25 శాతం ఏప్రిల్ ఒకటి తరువాత చెల్లించిన వారికి 50 శాతం అపరాధ రుసుము వసూలు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గోకులం షెడ్డు పరిశీలన

సి.బెళగల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలకల్లు గ్రామంలో నిర్మిస్తున్న గోకులం షెడ్డును ఎంపీడీవో రాణెమ్మ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి రైతుల కోసం కూటమి ప్రభుత్వం గోకులం షెడ్లు మంజూరు చేస్తుందన్నారు. ఎంపీడీవో వెంట ఏపీవో రామన్న, ఈసీ రంగస్వామి ఉన్నారు.

మద్దతు ధర కల్పించండి

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో వేరుశనగకు క్వింటానికి రూ.10వేలు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మికి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ ఈ సంవత్సరం అధిక వర్షాలతోపాటు తెగుళ్లతో వేరుశనగ కాయల ఉత్పత్తి భారీగా తగ్గిపోయిందని, కనీసం ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.7,679లు రైతుకు దక్కేలా చర్యలు తీసుకోవాలని జేడీకి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ జిల్లా కేంద్ర కార్యాలయంలోని ఈనెల 14న జరిగే ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునియప్ప, ఏపీ మున్సి పల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మద్దిలేటి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, డిప్యూటీ కార్యదర్శి రామాంజనేయులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాబులాల్, అయ్యరాజు, నాగేంద్ర, సవారి, షాలు, శివ పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

- కూలీల అవస్థలు
- అడ్రస్ లేని గుడారాలు, ప్రథమ చికిత్స కిట్లు



మండుటెండల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండలతో ఉపాధి కూలీలు తల్లడిలిపోతున్నారు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నప్పటికీ ఉపాధి కూలీలకు వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో గతంలో ఇచ్చిన గుడారాలు, ప్రథమ చికిత్స కిట్లు అడ్రస్ లేవు. పనుల వద్ద ఉపాధి కూలీలు సేద తీర్చుకోవడానికి గుడారాలను, ప్రథమ చికిత్స కిట్లను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసింది. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గూడారాలు, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయలేదు. గుడారాలు లేక పోవడంతో కూలీలకు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. మండలంలో 22 గ్రామ పంచాయ తీల్లో 13,323 జాబ్‌కార్డులు ఉండగా.. అందులో 1397 మంది మాత్రమే ఉపాధి పనులు చేస్తున్నారు. ఉదయం నుంచి మధ్యా హ్నం వరకు పనులు చేసినా కూలి గిట్టుబాటు కావడం లేదని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన గడ్డపారలు కూడా కూలీలకు అందలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధి పనుల వద్ద గుడారాలు, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

ఎండలకు అల్లాడుతున్నాం..



ఎండలకు తాము అల్లాడిపోతున్నాం. గుడారాలు, ప్రథమ చికిత్స కిట్లు పనుల వద్ద ఏర్పాటు చేయాలి. ఎండ వేడిమి నుంచి సేద తీర్చుకునేందుకు అవకాశం లేక చెట్లకిందకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుడారాలు ఏర్పాటు చేయాలి.

\- శ్రీదేవి, ఉపాధి కూలీ

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయండి



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పొదుపు సంఘాల ద్వారా ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో గూడారాలు, ప్రథమ చికిత్స కిట్లు, మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం స్పందించి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలి.

\- నాగలక్ష్మి, ఉపాధి కూలీ

మౌలిక వసతులు కల్పిస్తాం



ఉపాధి కూలీలకు పనుల వద్ద మౌలిక వసతులు కల్పిస్తాం. మండలంలో 22 గ్రామ పంచాయతీల్లో 13,3 23 జాబ్‌కార్డులు ఉండగా.. అందులో 1397 మంది ఉపాధి పనులు చేస్తు న్నారు పనుల వద్ద గూడారాలు, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. కూలీలకు వడదెబ్బ తగలకుండా తగు చర్యలు తీసుకుంటాం.

\- శ్రీనివాసులు, ఎంపీడీవో ఓర్వకల్లు

ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం మాదవీనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో అర్హులకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.8,99,926 చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల్లో బీపీఎల్‌కి దిగువన ఉన్న వారికి మెరుగైన వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నగదు అందిస్తారన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభా కర్‌యాదవ్, పల్లె రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పూత దశలో జాగ్రత్తలు అవసరం

ఓర్వకల్లు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మామిడి పంట పూత దశలో జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానశాఖ సీనియర్ శాస్త్రవేత్తలు ఠాగూర్ నాయక్, జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్-2024-25లో భాగంగా వారు పంటకు ఏ దశలో ఏయే మందులు వాడాలని రైతులకు సూచనలు చేశారు. ఉద్యాన శాఖ అధికారి వి.అనూష, రైతు సేవా సిబ్బంది రవికుమార్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలి



విద్యార్థులకు తాగునీరు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలని మాజీ ఎమ్మెల్సీ షేక్ మహ్మద్ ఇక్బాల్ సూచించారు. మంగళవారం ఓర్వకల్లులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తాగునీటి వసతిని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రామ చంద్రారెడ్డి మాట్లాడుతూ వాటర్ ట్యాంకులను, కొళాయిలను ఏర్పాటు చేసి విద్యార్థుల దాహార్తిని తీర్చడానికి సహకరించిన మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ పూర్వ విద్యార్థి గుట్టపాడు సర్పంచ్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ పాండురంగడు, మాజీ కార్పొరేటర్ సురేంద్ర, ఉపాధ్యాయులు నాగేంద్రమ్మ, భాస్కర్, చంద్రశేఖర్, రాజు, మురళీకృష్ణ, శివప్రసాద్, హరిప్రసాద్, పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.

సుంకులా పరమేశ్వరి ఆలయానికి పోటెత్తిన భక్తులు



సుంకులాపరమేశ్వరిని దర్శించుకుంటున్న భక్తులు

గూడూరు ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కె.నాగలాపురం సుంకులాపరమేశ్వరి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం మండలంలోని కె.నాగలాపురంలో వెలసిన సుకుంలాపరమేశ్వరి ఆలయానికి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కోడుమూరుకు చెందిన భక్తుడు సురేంద్ర అమ్మవారికి వెండి గ్లాసును కానుకగా సమర్పించినట్లు ఆలయ సిబ్బంది కేశవ తెలిపారు.

వ్యవసాయ విస్తరణాధికారుల సమస్యలపై పోరాటం

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విస్తర ణాధికారుల సమస్యలపై పోరాడతామని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరెడ్డి అన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కర్నూలు జిల్లాకు చెందిన ఒక ఉద్యోగికి పదవి దక్కడం ఇదే మొదటిసారి. మంగళవారం సంఘం సభ్యులంతా సన్మాన కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి నాగేశ్వరరెడ్డికి బొకే అందించి అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమం సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, కార్యదర్శి మనోహర్‌ల ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయాధికారుల సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరెడ్డి, ఏపీ ఎన్జీవోస్ కర్నూలు కార్యదర్శి కృష్ణుడు, నగర శాఖ కార్యదర్శి కాశన్న, ఏపీ రాష్ట్ర టైపిస్టు స్టెనోగ్రాఫర్ల సంగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

దుకాణాల ముందు మట్టి

- పట్టించుకోని కాంట్రాక్టర్
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు



దుకాణాల ముందు మట్టి కుప్పలు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ పంప్ హౌస్ పక్కనే నిర్మిస్తున్న నగర పాలక దుకాణాల వద్ద మట్టిని తరలించడంలో కాంట్రాక్టర్ అలసత్వం వహిస్తున్నారు. గత ఆరు నెలలుగా మట్టిని తరలించకుండా మీనవేషాలు లెక్కిస్తున్నారు. దుకాణాల నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్న మురుగు కాలువలు, ఫుట్‌పాత్‌లపై టన్నుల కొద్ది ఉన్న మట్టిని తొలగించలేదు. కాంట్రాక్టర్ పట్ల ఇంజనీర్లు ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అర్థం కావడం లేదు. మరమ్మతుల సమయంలో తవ్విన మట్టిని ఊరి బయట వేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌పై ఉంటుంది. దాని కోసం ప్రత్యేకంగా బిల్లులు కూడా విడుదల చేస్తారు. మురుగు కాలువలపై మట్టి పేరుకుపోవడంతో పంప్‌హౌస్‌లో వదిలిన వృథా నీరు బయటికి పోయే దారి లేక వెంకట రమణ కాలనీ ప్రధాన రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కాంట్రాక్టర్‌కు వత్తాసు పలుకుతున్నారు

మట్టిని తరలించడంలో అలసత్వం వహిస్తున్న కాంట్రాక్టర్‌కు అధికారులు వత్తాసు పలుకుతున్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ప్రధాన రహదారిపై నీరు నిలబ డటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

\- పుల్లారెడ్డి, పీపీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు

కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలి

ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న పెన్షనర్లు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజి బాబు డిమాండ్ చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళ, బుధవారాల్లో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ధర్నాకు మద్దతుగా మంగళవారం నగరంలోని ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బీఎస్ఎన్ఎల్ అసోసియేషన్ నాయకుడు యాకోబు అధ్యక్షత వహించగా అంజిబాబు మాట్లాడుతూ పెన్షనర్లకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలన్నారు. హయ్యర్ పెన్షన్ ఆప్షన్ అందరికీ వర్తింపజేయాలని, రైల్వే చార్జీలలో రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం సామాజిక పింఛన్ రూ.3వేలు ఇస్తున్నారని 20 నుంచి 30 సంవత్సరాలుగా పని చేస్తూ జమ చేసిన ఈపీఎఫ్ వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం దగ్గర ఉన్న పెన్షన్ పెంచడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. నగరంలో బీఎస్ఎన్ఎల్, పేపర్‌మిల్, గ్లాస్ ఫ్యాక్టరీ, డెయిరీ, బిర్లా కంపెనీ, తదితర సంస్థలలో పని చేస్తూ రిటైర్డ్ అయిన వారికి కేవలం వేయి రూపాయలలోపు పెన్షన్ వస్తుందన్నారు. ప్రస్తుతం వచ్చే పెన్షన్ వైద్య ఖర్చులకు కూడా సరిపోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ పార్లమెంటు సమావేశాల్లో పెన్షనర్లకు నిధులు కేటాయించకుండా అన్యాయం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.సుధాకరప్ప, బీఎస్ఎన్ఎల్ నాయకులు మహేశ్వరరావు, నాయకులు జే.శంకర్‌రావు, మోహన్, రామన్న, చంద్రశేఖర్‌రెడ్డి, మురళీ మోహన్‌రావు పాల్గొన్నారు.

సాయి మెగా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి తనిఖీ



స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని సాయిమెగా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ మంగళవారం తనిఖీ చేశారు. హాస్పిటల్, స్కానింగ్ కేంద్రంలోని రికార్డు, రిపోర్టులను ఆమె పరిశీలించారు. హాస్పిటల్, స్కానింగ్ కేంద్రంలో వైద్యుల అర్హత సర్టిఫికెట్లు, నోటీసు బోర్డులో పెట్టాలన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం లింగనిర్ధారణ పరీక్షలు చేయరాదన్న బోర్డు పెట్టాలన్నారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం అన్ని అర్హత ప్రమాణాల ప్రకారం దరఖాస్తు చేయాలన్నారు. డీఎంహెచ్‌వో వెంట డెమో శ్రీనివాసులశెట్టి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి ఉన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి

సి.బెళగల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలపై దృష్టి సారించాలని ఏడీఏ సాలురెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని చింతమానుపల్లె గ్రామంలో ఏవో మల్లేష్‌కుమార్ అధ్యక్షతన పొలంలబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ సాలురెడ్డి మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఏవో మల్లేష్‌కుమార్, ఎంపీవోలు వెంకటేశ్వర్లు, ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై గ్రామసభ



గ్రామసభకు హాజరైన ప్రజలు

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమడ గుంట్ల గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు ఎంపీడీవో రాముడు హాజరయ్యారు. గ్రామంలో పలు కాలనీల్లో అంతర్గత సీసీ రహదారులు, డ్రైనేజీ పనుల మంజూరుకు సమావేశం నిర్వహించారు. రామాలయం సమీపంలోని రామాంజనేయులు ఇంటి నుంచి దుర్గమ్మ గుడి వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ, కుంటచెరువు ఏరియాలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం, పెద్దరంగన్న ఇంటి దగ్గర నుంచి పెద్ద కిష్టన్న ఇంటివరకు, సోమమ్మ అంగడి నుంచి ఎస్సీ కాలనీ కట్ట వరకు సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణం. దుర్గమ్మ గుడి దగ్గర నుంచి మాజీ సర్పంచ్ దాసు ఇంటివరకు సీసీ రహ దారి, డ్రైనేజీ కాలువల ఏర్పాటుకు తీర్మానాలు ఆమోదించారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల వినియోగించడానికి చర్చించారు. టీడీపీ నాయకులు పొలాల రహదారులను నిర్మించి రైతుల ఇబ్బందులు తొలగిం చాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ గంగరాజు, పంచాయితీ కార్యదర్శి శంక రమ్మ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలి

సి.బెళగల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని కోడుమూరు, నంద్యాల జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు రైతులు ఆయిల్ పామ్ పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారులు రవలి, సతీష్, ఏసేపు మాట్లాడుతూ ఆయిల్ పామ్‌ను చౌడు భూముల్లో బాగా పెరుగుతాయని, మంచి దిగుబడి వస్తుందన్నారు. హార్టికల్చర్ అసిస్టెంట్లు చెంచురాజు, నాగన్న, రాజశేఖర్ నాయక్, భాస్కర్, రైతులు సలిమ్, ఇర్ఫాన్, ఈరన్న పాల్గొన్నారు.

ఘంటసాల.. ప్రపంచానికే గర్వకారణం

ప్రముఖుల నివాళి



ఘంటసాల విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వైద్యులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఘంటసాల ప్రపంచమంతా గర్వించదగ్గ గాయకుడని, ఆయన తెలుగువాడిగా జన్మించడం తెలుగువారికి గర్వకారణమని పలువురు వక్తలు నివాళి అర్పించారు. మంగళవారం ప్రముఖ తెలుగు చలనచిత్ర నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు దివంగత ఘంటసాల వెంకటేశ్వరరావు 51వ వర్ధంతిని నగరంలోని ఆయకర్ భవన్ కూడలిలోని ఘంటసాల విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఘంటసాల విగ్రహానికి పూలదండలు వేసి ఆయన సేవలను శ్లాఘించారు. ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ మాట్లాడుతూ దైవం మానుష రూపేణా అన్న సూక్తికి ఘంటసాల అక్షర సత్యంగా నిలిచిపోతారని కొనియాడారు. విశ్రాంత ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ ఘంటసాల గొంతెత్తి పాడితే ప్రపంచమే ఉలిక్కిపడి చూస్తుందని అన్నారు. ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఘంటసాల గాన కళాసమితి వారు ఏటా ఆయన జయంతి, వర్ధంతులను ఘనంగా నిర్వహించడం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో న్యూరోసర్జన్ డాక్టర్ డబ్ల్యూ సీతారాం, శ్రీశైలం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొండయ్య, పద్మశ్రీ ఘంటసాల గానకళా సమితి అధ్యక్షుడు వాసుదేవమూర్తి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు విద్వాన్ పత్తి ఓబులయ్య, ఘంటసాల గాన కళాసమితి అధ్యక్షుడు టీఎస్‌రావు, గాయకులు సుధారాణి, రమణయ్య, రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో కంపచెట్లు తొలగింపు



కంపచెట్లు తొలగిస్తున్న మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫిరోజ్, కూలీలు

కల్లూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ముస్లిం శ్మాశాన వాటికలో పాణ్యం టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.ఫిరోజ్ కంప చెట్లను తొలగించారు. ముస్లింల బడేరాత్ (పెద్దల పండుగ) రానున్న నేపథ్యంలో ఆయన మంగళవారం కల్లూరులోని శ్మశాన వాటికను పారిశుధ్య కార్మికులతో కలిసి కంపచెట్లను తొలగించారు. ఈసందర్భంగా ఎస్.ఫిరోజ్ మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా బడేరాత్‌కు ముస్లిం శ్మశాన వాటికలో కంపచెట్లు తొలగిస్తున్నట్లు తెలిపారు.

గూడూరు: గూడూరులోని ముస్లిం శ్మాశాన వాటికలో ముళ్ల కంప తొలగింపు కార్యక్రమం చేపట్టినట్లు టీడీపీ సీనియర్ నాయకుడు రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు, మైనార్టీ నాయకుడు మన్సూర్ బాషా తెలిపారు. మంగళవారం శ్మశాన వాటికలో ముళ్లపొదల తొలగింపును టీడీపీ నాయకులు పరి శీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పౌలు, కౌన్సిలర్ కలాం బాషా, కోఆప్షన్ సభ్యుడు రామాంజనేయులు, చాంద్ బాషా, వాహిద్ పాల్గొన్నారు.

పది విద్యార్థినికి అభినందన

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేస్తున్న మనబడి మాసపత్రికలో కర్నూలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఉర్దూ)కు చెందిన పదో తరగతి బాలిక ఎస్.మతీనా ప్రచురించిన కవిత ప్రచురించడంపై జిల్లా విద్యాశాఖ పక్షాన తరపున డీఈవో శ్యామ్యూల్‌పాల్ అభినందన తెలిపారు. ఉర్దూ మాధ్యమానికి సంబంధించిన ఉన్నత పాఠశాలలో రెండో మాధ్యమంగా తెలుగు చదివి తెలుగు బాషా సాహిత్యాలలో ప్రతిభ కనబరచడం విశేషమన్నారు.

ప్రశాంతంగా ప్రీ ఫైనల్ పరీక్షలు



నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో ప్రీఫైనల్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం రెండో లాంగ్వేజ్ హిందీ పరీక్ష జరిగింది. ఈనెల 20వ తేదీ వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. పబ్లిక్ పరీక్షలకు ఇంకా 33 రోజులు సమయం ఉండడంతో ముందుగానే ప్రభుత్వం ఈసారి రివిజన్ టెస్టుల కంటే ముందు ప్రీ ఫైనల్ పరీక్షలు జరుపుతుంది. 175 ఉన్నత పాఠశాలల నుంచి 12వేల మంది విద్యార్థులపైగా ఏడాది టెన్త్ వార్షిక పరీక్షలు రాయనున్నారు. విద్యాశాఖ అధికారులు 100శాతం ఉత్తీర్ణత కోసం ప్రత్యేక తరగుతులు నిర్వహించారు.

ఉపాధి పనుల్లో నాణ్యత పెంచాలి

తుగ్గలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో నాణ్యత పెంచాలని ఏపీడీ ఫక్కీరప్ప అన్నారు. మంగళవారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరి తదితర గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ఆయన కూలీలతో మాట్లాడుతూ పనులకు వచ్చిన కూలీల పేర్లను మాత్రమే మస్టర్లలో చేర్చాలని, అలా కాకుండా వేరే పేర్లు చేరిస్తే కూలీలే ప్రశ్నించాలన్నారు. రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలన్నారు. పనుల్లో అవినీతికి పాల్పడితే కేసులు నమోదు చేయడంతో పాటు సంబంధిత ఉపాధి సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈయన వెంట ఏపీవో హేమసుందర్ ఉన్నారు.

స్థలం కోసం దరఖాస్తు చేసుకోండి

పత్తికొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో స్థలం లేని నిరుపేదలు స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రమేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని సర్వేనంబర్ 710లో గతంలో పట్టాలు మంజూరు చేశారని అన్నారు. అయితే నిర్ణీత గడువు ముగిసినా పట్టాలు పొందినవారు నిర్మాణాలు చేపట్టలేదన్నారు. ఆ పట్టాలను రద్దుచేసి ఇంటిస్థలం లేని నిరుపేదలకు అక్కడ పట్టాలు అందించాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు లేఖ ద్వారా కోరినట్లు తెలిపారు. ఆయన అభ్యర్థన మేరకు ఆ స్థలంలో గతంలో ఇచ్చిన పట్టాలను రద్దుచేసి స్థలం లేని నిరుపేదలకు స్థలాలను ఇస్తున్నామని అన్నారు. అర్హత కలిగిన వారు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను అందించాలన్నారు.

అధికారులకు పదోన్నతులు

మద్దికెర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న బసినేపల్లి వీఆర్వో శివన్నకు సీనియర్ అసిస్టెంట్‌గా, తహీసల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రామదాసుకు ఆర్ఐగా పదోన్నతులు వచ్చాయని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ మంగళవారం తెలిపారు. జిల్లా అధికారులు ఇంకా స్థానాలు కేటాయించలేదని అన్నారు.

చిన్నారులకు రోగ నిరోధక మందు పంపిణీ



చిన్నారులకు ముందు వేస్తున్న సంస్థ సభ్యులు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన చిన్నారులకు నిరోధక మందు స్వర్ణామృత ప్రాసనను ఆవోపా అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా మాట్లాడుతూ, త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి ఆశీస్సులతో తమ అసోసియేషన్‌కు చెందిన మాజీ గౌరవాధ్యక్షుడు కాకుబాల్ నగేష్ సౌజన్యంతో ఈ ఔషధాన్ని 198 మంది చిన్నారులకు 8వ విడతగా అందించామని తెలిపారు. కార్యక్రమంలో రఘు, ప్రతాప్, ఈరన్న శెట్టి, యాదగిరి వెంకటేశ్వర్లు, రత్తయ్య, మహిళా విభాగం శ్రీదేవి, అనిత, పద్మశ్రీ పాల్గొన్నారు.

బైపాస్ భూ బాధితులకు న్యాయం చేయాలి



తమ ప్లాట్ల మీద బైపాస్ వెళ్తుందని చూపుతున్న బాధితులు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారు ప్రాంతంలోని ఎమ్మిగనూరు వెళ్లే రహదారిలోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నుంచి ఆలూరు రోడ్డు వరకు నిర్మిస్తున్న బైపాస్ (నేషనల్ హైవే 164)లో భూమి కోల్పోతున్న బాధితులకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. మాస్టర్ ప్లాన్ లేదా పాత బైపాస్ మీదుగా కాకుండా కొత్తగా తమ ప్లాట్లు, ఇళ్ల మధ్యలో రాజకీయ ఒత్తిళ్లతో బైపాస్‌ను తీసుకెళ్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. బైపాస్ నిర్మాణానికి తాము భూమి ఇస్తున్నట్లు డాక్యుమెంట్లు అంగీకార పత్రాన్ని కూడా ఇవ్వలేదని అన్నారు. బలవంతంగా మా భూములను లాక్కొని బైపాస్ నిర్మాణం చేపట్టడం అన్యాయమన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కనీసం పరిహారం కూడా ఇవ్వలేదని, ప్రస్తుతం ఉన్న ధరలకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని లేదా అలైన్మెంట్ మార్చాలని బాధితులు నాగరాజ్, శేషాద్రి, జగన్నాథ్, ఆనంద్ బాబు, సునీత, చంద్ర, రవి, శ్రీనిధి, గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.

పోషకాహారం పంపిణీ

ఆదోని టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన 20 మంది క్షయ వ్యాధిగ్రస్తులను ఉపాధ్యాయులు నిరంజన్ కుమార్, ఫయాజుద్దీన్ ఆరు నెలలు పాటు దత్తతకు తీసుకొని వారికి మంగళవారం రూ. వెయ్యి విలువ చేసే పోషకాహారాన్ని పంపిణీ చేశారు. టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శేఖన్‌బాను మాట్లాడుతూ ప్రధాన మంత్రి టీబీ ముక్తి అభియాన్ పథకం కింద టీబీ రహిత దేశంగా రూపొందించే ప్రక్రియలో భాగంగా టీబీ వ్యాధిగ్రస్తులను దత్తతకు తీసుకొని దాతలు వారికి ఆరు నెలల పాటు పోషక ఆహారం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ బాబురాజ్, లలితమ్మ, సుబ్బమ్మ, పద్మావతి, భాస్కర్, మోనికా పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

అస్పరి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కారుమంచి గ్రామంలో దక్షిణమూర్తి అనే వ్యక్తిపై మంగళవారం అదే గ్రామానికి చెందిన చిన్న లింగన్న వేటకొడవల్లితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు. వారిద్దరి మధ్య పాత కక్షలు ఉన్నాయని సీఐ పేర్కొన్నారు. చిన్న లింగన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎప్పుడు కొంటారు..?

● వ్యాపారుల చేతుల్లో మోసపోతున్న రైతులు
● 6 కిలోల పేరుతో దగా



కల్లాల్లో నిల్వ ఉన్న పప్పుశనగ పంట

మద్దికెర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు సాగు చేసిన పప్పుశనగ దిగుబడులు వస్తున్నాయి. ప్రభుత్వం ఇంత వరకు కొనుగోలు చేయడానికి సిద్ధం కాలేదు. మద్దతు ధర కూడా ప్రకటించలేద. దిగుబడులను నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వ గోదాములేక అమ్ముకోవడానికి సిద్ధమవుతున్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు క్వింటానికి 5-6 కిలోల వరకు తరుగు తీసుకుంటున్నారు. ధర కూడా రూ.5,500 నుంచి రూ.5,700ల వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మద్దికెర మండలంలో మొత్తం 11 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో మొత్తం వర్షాధార పంటలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. రబీలో నల్లరేగడి పొలాల్లో 20వేల ఎకరాల్లో పంట సాగు చేశారు. రైతులు పంటలను కోసి కల్లాల్లో ఆరబోస్తున్నారు. ప్రస్తుతం పప్పుశనగ కింటం ధర ఆశించిన స్థాయిలో రావడం లేదు. గత ఆరు నెలల క్రితం వరకు రూ.8 వేలు నుంచి రూ.9వేలు ఉన్న పప్పుశనగ రూ.5,700లకు పడిపోయింది. ఈ ఏడాది తుపాన్ ప్రభావం వల్ల దిగుబడి అంతంత మాత్రమే వచ్చింది. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తే.. రైతుకు తరుగు ఆరు కిలోలు మిగులుతుందని వాపోతున్నారు. ఈ ఏడాది నల్లరేగడి పొలాల్లో సాగు చేసిన పంట ఆశాజనకంగా లేకున్నప్పటికీ ఎకరాకు క్వింటం 3 నుంచి 5లోపు దిగుబడి వచ్చిందని తెలిపారు. ఎకరాకు రూ.15వేలు వరకు విత్తనాలు, మందులు, కూలీలు ఖర్చు పెట్టామని, మాకు లాభాలు రావడం లేదని రైతులు వాపోగా, కౌలు రైతులు మాత్రం కౌలు చేసుకునే ధరలు కూడా మా నెత్తిన పడి నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పప్పుశనగను కొనుగోలు చేయాలని, అలాగే రైతులను ఆదుకోవాలని కోరారు.



● దళారుల మోసం

ప్రతి ఏడాది దళారుల చేతిలో రైతులు మోసపోతున్నాం. గతంలో కూడా కొనుగోలు చేసిన వ్యాపారులను రైతుల దగ్గర శనగలు కొని డబ్బులు ఇవ్వకుండా పారిపోయిన సంఘటనలు ఉన్నాయి. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వెంటనే పప్పుశనగ పంటను కొనుగోలు చేయాలి.

- నాగరాజు, ఎం.అగ్రహారం





● ప్రభుత్వం కొనుగోలు చేయాలి

కష్టపడి పండించిన పప్పుశనగ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. దళారులు తూకాల్లో కూడా మోసం చేస్తున్నారు. ఈ ఏడాది పంట దిగుబడి అంతంత మాత్రమే వచ్చింది. వచ్చిన దిగుబడిని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలి.

- మల్లికార్జున, మద్దికెర

అంత్యోదయ లక్ష్యంగా పనిచేద్దాం



దీన్ దయాళ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆదోని ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ స్ఫూర్తితో బీజేపీ ప్రతి కార్యకర్త, ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా పనిచేయాలని బీజేపీ సీనియర్ నాయకులు దేశాయి చంద్రన్న, అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజు గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేపీ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీరాములు, సదాపురం మండల అధ్యక్షుడు ఉషారాజ్, ఆదోని పట్టణ సెంట్రల్ అధ్యక్షుడు నాగార్జున, జిల్లా అధికార ప్రతినిధి విజయకృష్ణ, శ్రీనివాస్‌ఆచారి, కోసిగయ్య, రామకృష్ణ, అంజయ్, రామకృష్ణ, రవిశంకర్, ముని, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటిలో వ్యర్థాలు

● ఫిల్టర్ చేయకుండానే నేరుగా సరఫరా

ఆలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు పట్టణంలోని ఇందిరా నగర్‌లో మంగళవారం సరఫరా అయిన తాగు నీటి కొళాయిల ద్వారా జంతువుల వెంట్రుకలు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఫిల్టర్ చేయకుండా నేరుగా సరఫరా చేయడంతో ఆ నీటిని తాగి చిన్నారులు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని, అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని టీడీపీ జిల్లా నాయకులు కొమ్ము రామాంజినేయులు, టీడీపీ నాయకులు బి రాజు కోరారు. ఈ విషయంలపై పంచాయతీ ఈవో ప్రభాకర్ రావ్‌ను వివరణ కోరగా బాపురం రిజర్వాయర్ ద్వారా నీరు సరఫరా అవుతుందని అక్కడ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపడుతాం.

నేడు బసవేశ్వరస్వామి రథోత్సవం



వీరభద్ర గౌడ్‌ను ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న ఆలయ నిర్వాహకులు

హాలహర్వి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : బాపురం గ్రామంలో బసవేశ్వరస్వామి రథోత్సవం బుధవారం ఉంటుందని ఆలయ కమిటీ నిర్వాహకులు మృత్యుంజయగౌడ్, తిమ్మారెడ్డి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. దర్శనం కోసం వచ్చే భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిలుగా టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ పాల్గొంటారని తెలిపారు.

నేడు రథోత్సవం

దేవనకొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టులోని కౌలుట్ల చెన్నకేశవస్వామి రథోత్సం బుధవారం జరుగనుంది. బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రథకలశస్థాపన, రథాంగ హోమం, రథపూర్ణహుతి, మహాసుదర్శన హోమం, సాయంత్రం హనమద్వాహనం కార్యక్రమాలు నిర్వహించారు. పత్తికొండ,కోడుమూరు ఎమ్మెల్యేలు శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి హాజరుకానున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు.



చెన్నకేశవస్వామి రథం వద్ద హోమం చేస్తున్న పురోహితుడు

మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం

మంత్రాలయం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. మంగళవారం మాఘమాసం చతుర్థి శుభదినం సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, విశేష పంచామృతా భిషేకం చేసి పట్టుచీర, బంగారు, వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలు, ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రైతులకు విశిష్ట నమోదు ప్రక్రియ ప్రారంభం



రైతులకు యూనిక్ కోడ్ గురించి తెలియచేస్తున్న ఏవో

మద్దికెర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు గుర్తింపు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేసిందని, ఆధార్ మాదిరి 14 అంకెలతో కూడిన విశిష్ట నమోదు ప్రక్రియను రైతులు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి రవి తెలిపారు. మంగళవారం రైతు సేవ నమోదు కేంద్రంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 5వేల మందికి పైగా రైతులు ఉన్నారని, పట్టాదారు పాసు పుస్తకం గల ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. నమోదు ప్రక్రియ తప్పనిసరిగా చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు అందుతాయని, లేకపోతే నష్టపోతారన్నారు. రైతు విశిష్ట నమోదు గుర్తింపు ప్రక్రియ మరింత వేగవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది జాకీర్ ఉన్నారు.

పత్తికొండ : పట్టాపొలం ఉన్న ప్రతిరైతు యూనిక్‌కోడ్ (గుర్తింపుసంఖ్య) రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి వెంకట్రాముడు తెలిపారు. రిజిష్టర్ చేయుంచుకున్న రైతులకు ప్రభుత్వం 11అంకెలతోకూడిన గుర్తింపు నంబరును కేటాయిస్తుందన్నారు. పత్తికొండ మండలంలో మొత్తం 15,195 మంది రైతులు ఉన్నారని, ఈనెల 25లోపు వారందరూ నమోదు చేసుకోవాలన్నారు. రైతుభరోసా కేంద్రాలు, మీసేవా కేంద్రాల్లో ఈ యూనిక్‌కోడ్ నమోదు చేసుకోవచ్చన్నారు.

తుగ్గలి: రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి అని ఏవో పవన్ కుమార్ అన్నారు. మంగళవారం జొన్నగిరి, తుగ్గలిలో రైతు నమోదు కేంద్రంలో రైతుల చేత గుర్తింపు విశిష్ట సంఖ్య రిజిస్టర్ చేయించారు. ఆయన మాట్లాడుతూ సొంత భూమి ఉన్న ప్రతి రైతు ఈ గుర్తింపు ఉన్న 14 అంకెలు ఉన్న ప్రత్యేక గుర్తింపు విశిష్ట సంఖ్యను పొందాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మల్లేష్, మల్లేశ్వరి, తదితరులు ఉన్నారు.

మామిడి సాగుపై శిక్షణ



మామిడి పూతను పరిశీలిస్తున్న అధికారులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలో సిద్దనగట్టు గ్రామంలో మంగళవారం రైతులకు మామిడి సాగుపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహనంది ఉద్యాన పరిశోధన శాస్త్రవేత్త ఠాగూర్ నాయక్ విచ్చేసి రైతులకు సలహాలు, సూచనలు తెలియజేశారు. మామిడి సాగులో పూత, పిందె సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ రైతులు ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారులు అనూష(ఓర్వకల్లు), నరేశ్(కర్నూలు), ఉద్యాన సిబ్బంది పాల్గొన్నారు.

వలస వెళ్లొద్దు.. పనులు కల్పిస్తాం..



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీవో

ఆదోని రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల ప్రజలు ఎవరు కూడ వలసలు వెళ్లొద్దని ఏపీవో కృష్ణమూర్తి తెలిపారు. బతుకు తెరువుకోసం ఎవరు కూడ ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లొద్దని గ్రామాల్లోనే ఉపాధి పనులు కల్పిస్తామన్నారు. మంగళవారం మదిరె గ్రామంలో ఉపాధి కూలీలు, ప్రజలతో సమావేశమై వారికి అవగాహన కల్పించారు. గిట్టుబాటు కూలీ పడేలా చూస్తామని, వలసలు వెళ్లడం వలన జరిగే అనర్థాలను ఏపీవో తెలియజేశారు. అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తామని అన్నారు. ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఏపీవో హెచ్చరించారు.

గ్రామ సమస్యలు నా దృష్టికి తీసుకురండి

● ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్



గ్రామ నాయకుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న వీరభద్ర గౌడ్

ఆలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలపై ఆయన చర్చించారు. కూటమి ప్రభుత్వం గ్రామ స్థాయి అభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. పల్లె పండుగ నిధులతో ప్రభుత్వం గ్రామాల్లో సీసీ రోడ్లు వేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అట్టేకల్ జగన్మోహన్ బాబు, దేవేంద్ర, తిమ్మయ్య, వన్నూరు వలి, కొమ్ము రాజు, రాము యాదవ్, రమేష్, కిట్టు, మనుమప్ప, బోయ వీరేష్, అగ్రహారం ఈరన్న పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు మహర్దశ



ఎస్సీ హాస్టల్ భవనం గోడలను మరమ్మతుల కోసం పగలగొడుతున్న కూలీలు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ హాస్టల్‌కు మహర్దశ నెలకొంది. పట్టణంలోని నాలుగు సంక్షేమ ఎస్సీ హాస్టళ్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఎస్సీ నెంబరు-1 బాలుర హాస్టల్‌కు రూ.21 లక్షలు, ఎస్సీ బాలుర నెంబరు 2 హాస్టల్‌కు రూ.36 లక్షలు, బాలికల హాస్టల్‌కు రూ.19 లక్షలు, ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు మరో రూ, 20 లక్షలు విడుదల చేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారి బాబు తెలిపారు. అదనపు టాయిలెట్లు, బాత్రూంలతో పాటు, విద్యుత్ కాంపౌండ్, గదుల మరమ్మతులు, డైనింగ్ హాల్, తాగునీటి లీకేజీలు పనులు చేపడతామన్నారు. కాంట్రాక్టర్ కూడా పనులు ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలోనే పనులు పూర్తి చేసి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు.

పేదలకు మాత్రమే స్థలాలు ఇస్తాం



జగనన్న కాలనీని పరిశీలిస్తున్న తహసీల్దార్ హుశేన్ సాహేబ్

మద్దికెర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత ప్రభుత్వ హయాంలో అనర్హులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఉంటే రద్దు చేసి పేదలకు మాత్రమే ఇళ్ల స్థలాలు ఇస్తామని తహసీల్దార్ హుశేన్‌సాహేబ్ అన్నారు. మంగళవారం స్థానిక జగనన్న కాలనీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మద్దికెరలో మొత్తం 6 లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగిందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు విచారణ చేసి అనర్హులకు ఇచ్చి ఉంటే వాటిని రద్దు చేస్తామని అన్నారు. పదెకరాలు పైబడిన వారికి, ఉద్యోగస్థులకు, ఇన్‌కం ట్యాక్స్ కట్టేవారికి ఇళ్ల స్థలాలు ఇవ్వకూడదని, ఆ నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లస్థలాలు ఇచ్చి ఉంటే రద్దు చేయడం జరుగుతుందన్నారు. పేదలు ఎవరైనా ఉంటే వారికి న్యాయం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రంగస్వామి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి



సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఆదోని రూరల్, : ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీపీఐ నాయకులు అజయ్‌బాబు, సుదర్శన్ అన్నారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో పేదప్రజలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ, గ్రామాల్లో మూడుశెంట్లు, పట్టణాల్లో రెండు శెంట్ల చొప్పున నిరుపేదలకు ఇంటి స్థలాలను మంజూరు చేయాలని, ఇండ్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. నాడు ప్రతి పక్షంలో ఉన్నప్పుడు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిందని, వాటిని నేరవేర్చాలని లేనిపక్షంలో దశలవారిగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీరేష్, విజయ్, లక్ష్మీ నారాయణ, లింగప్ప, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యాలతో ఆడుకోకండి

మద్దికెర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మద్దికెర జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఎదురుగా శ్రీవిద్యాసాయి కళాశాల, పాఠశాలలు ఉన్నాయని, పక్కనే డంపింగ్ యార్డు చేసి చెత్తను మంట పెట్టడం వల్ల ఆ పొగను విద్యార్థులు పీల్చడం వల్ల పిల్లల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయనీ శ్రీవిద్యాసాయి కళాశాల ఎండీ యజ్ఞం వెంకటమాధవ్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హుశేన్‌సాహేబ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మా పాఠశాలలో మొత్తం 1000 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారని, గ్రామంలోని చెత్తను పాఠశాల పక్కన వేసి మంట పెడుతున్నారని, వారం రోజుల పాటు ఆ పొగ మా విద్యాసంస్థలను కమ్మేస్తుందన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యాసాయి కళాశాల ప్రిన్సిపాల్ బాలసునీత, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, కార్యదర్శి శివకుమార్ ఉన్నారు.

కేదారేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

వెల్దుర్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక జర్నలిస్టు కాలనీలో కేదారేశ్వరస్వామి(అర్ధనారీశ్వరస్వామి) విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం ప్రారంభమవుతాయని లక్ష్మీవేంకటేశ్వర, శ్రీసాయినాథ, అయ్యప్పస్వామి దేవాలయ అర్చకుడు శ్రీధర్ స్వామి తెలియజేశారు. భక్తులు, ప్రజలు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి



ధర్నా చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని ఏఐకేఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక సోమప్ప సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సత్యన్న మాట్లాడుతూ రాయలసీయలో అత్యంత వెనుకబడిన కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో రైతాంగం పూర్తిగా కరువు కాటకాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోజు వారి కూలీ కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న రాజోలి బండ డైవర్షన్ స్కీమ్(ఆర్డీఎస్) కుడికాలువ, గుండ్రేవుల ప్రాజెక్టు, వేదావతి ప్రాజెక్టులకు ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించి పెండింగ్ పనులు పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. ఆదోని మెడికల్ కళాశాల పనులను పునఃప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు హనుమంతప్ప, పెద్దారెడ్డి, నాగేంద్ర, బాలరాజు, మునెప్ప, రామన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన ఉండాలి



శిక్షణ ఇస్తున్న ఏపీఎస్డీఆర్ఎఫ్ బలగాలు

మంత్రాలయం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రాణాలను రక్షించుకునేందుకు చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్ఎస్ఐ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం విఠోభరావు, వీఆర్వో భీమన్నగౌడు ఆధ్వర్యంలో ఆకస్మికంగా వరదలు, గుండెపోటు, భూకంపాలు, బహుళ అంతస్థులు కూలిన సమయంలో, నీటి ప్రమాదాలో మునగడం, విద్యుత్ షాక్ జరిగినప్పుడు, మంటలు చెలరేగినప్పుడు ప్రాణాలు ఎలా రక్షించుకోవాల్సిన అనే విషయాలపై ఏపీఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. రిస్క్ టీమ్ చేస్తూ.. విద్యార్థులతో చేయించి ప్రాణాలను రక్షించే పద్ధతులను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోట్ల చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ నరసింహరాజు, వీరేష్ రావు, భూషణం, ఈరన్న, గోపాల్, ప్రసన్న కుమారి, అనురాధ, అరుణాదేవి, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం

మంత్రాలయం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. మంగళవారం మాఘమాసం చతుర్థశి శుభదినం సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, విశేష పంచామృతా భిషేకం చేసి పట్టుచీర, బంగారు, వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలు, ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి మహామంగళహారతులు ఇచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

జాబ్ మేళాకు స్పందన



ఇంటర్వ్యూకు హాజరైన యువతీ, యువకులు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాకు స్పందన వచ్చింది. మంగళవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా కు కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 84 మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు. బి న్యూ మొబైల్స్, యంగ్ ఇండియా, ఎస్‌బీఐ లైఫ్ మొదలగు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించగా 21 మంది ఉద్యోగాలకు ఎంపిక ఆయ్యారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, కళాశాల సిబ్బంది, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయితేజ, స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిలో విరిగిన రెయిలింగ్

● పట్టించుకోని అధికారులు



కోటేకల్-ఆరెకల్ మధ్య మలుపులో విరిగిపోయిన రెయిలింగ్

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు-ఆదోని జాతీయ రహదారిలో అక్కడ అక్కడ ఉన్న మలుపుల్లో వాహనాలు ప్రమాదాలు జరిగినప్పుడు గుంతల్లో పడకుండా రహదారిని ఆనుకొని ఏర్పాటు చేసిన రెయిలింగ్(ఇనుపకంచె) తెగిపోయింది. రోజులు గడుస్తున్న అధికారులు తిరిగి మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. ఎమ్మిగనూరు మండల పరిధిలోని కోటేకల్ సమీపంలో ఆదోని-ఎమ్మిగనూరు జాతీయ రహదారిలో ఆరెకల్ మలుపులో గతంలో హైవే అధికారులు రోడ్డును ఆనుకొని ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేసిన రెయిలింగ్‌ను ఏదో వాహనం ఢీకొని ఇరిగిపోయింది. దీంతో ఇనుపరేకులు కాస్తా తెగిపోయాయి. మలుపు కావటంతో వేగంగా వచ్చే వాహనదారులు అప్రమత్తంగా ఉండకపోతే ప్రమాదాలు జరిగి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి పడే ప్రమాదం ఉంది. రెయిలింగ్ తెగిపోయి రోజులు గడుస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారి కావటంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. అధికారులు స్పందించి వెంటనే రెయిలింగ్‌కు మరమ్మతులు చేసి యథావిధిగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్ర'జల' కష్టాలు

● సుంకేశ్వరిలో దాహం..దాహం
● అలంకారప్రాయంగా సంపు
● పట్టించుకోని అధికారులు

మంత్రాలయం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామంలో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి వేచి ఉండి నీటిని పట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. పట్టించుకోవాల్సిన సర్పంచు, గ్రామ కార్యదర్శి ఇంజనీరింగ్ అసిస్టెంట్ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. జలజీవన్ పథకం కింద రూ.20 లక్షలు ఖర్చుచేసి 60వేల లీటర్ల నీటి సామర్థ్యం గల సంపును నిర్మించారు. అయితే ఆ సంపునకు విద్యుత్‌మోటర్‌తో పాటు కనెక్షన్ ఇవ్వడం మరిచారు. దీంతో సంపు రెండేళ్లుగా అలంకారప్రాయంగానే మారింది. బీరప్ప గుడిపెద్దలు రెండుగుమ్మెలు ఏర్పాటు చేశారు. గుక్కెడు తాగునీటి కోసం దాహం....దాహం.... అంటూ తోపుడుబండ్లపై బిందెలు పెట్టుకుని తాగునీటిని తెచ్చుకుంటున్నారు. బీసీ కాలనీలో రెండునెలలుగా తాగునీటి కోసం అవస్థలు పడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. గత ప్రభుత్వంలో జలజీవన్ పథకం కింద ఇంటింటికి కొలాయి ఇస్తామని చెప్పిన కాంట్రాక్టర్ బిల్లులు రావడం లేదని పత్తాలేకుండా పోవడంతో తాగునీటి ఆశ నెరవేరలేదు. ఎవరికి వారే రూ.3వేల నుంచి రూ.5 వేల వరకు గ్రామ సర్పంచుకు నగదు ఇచ్చి పైపులైను వేయించుకుంటున్నామని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తాగునీటి కోసం వృద్ధులు, పిల్లలు, మహిళలు నీటికోసం పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



సుంకేశ్వరిలో అలంకారప్రాయంగా తాగునీటి సంపు



తాగునీటి కోసం తోపుడుబండ్లు, బిందెలతో వేచి ఉన్న గ్రామస్థులు

త్వరలో తాగునీటి ఎద్దడి నివారిస్తాం



బీసీ కాలనీలో తాగునీటి సమస్య ఉంది. త్వరలో రూ.20 లక్షలతో నిర్మించిన సంపునకు విద్యుత్ మోటార్, పైపులైను కనెక్షన్ ఇచ్చి తాగునీటి ఎద్దడి నివారిస్తాం. గ్రామస్థులే డబ్బులు ఇచ్చి పైపులైను వేయించుకున్నట్లు తమ దృష్టికి వచ్చింది. జీఆర్పీ పంప్ హౌస్ వద్ద బోరు ద్వారా సంపుకి కనెక్షన్ ఇచ్చి ప్రజల దాహార్తిని తీరుస్తాం.

- వెంకటరాముడు, ఏఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, మంత్రాలయం

ఆరోపణలు అవాస్తవం



గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామస్థులతో డబ్బులు తీసుకొని పైపులైను వేయించినట్లు కొంతమంది గిట్టనివారు తమపై ఆరోపణలు చేస్తున్నారు. ఇందులో వాస్తవం లేదు. ఈవిషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లాను.

- సుంకేశ్వరి, సర్పంచ్, ముక్కరన్న

వరద కాలువను నిర్మించాలి



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

కౌతాళం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మేలిగనూరు వద్ద ఉన్న తుంగభద్ర నదిపై వరద కాలువను నిర్మించి ఆంధ్ర పశ్చిమ ప్రాంత రైతులకు సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ కోరారు. మండల పరిధిలోని మేలిగనూరు వద్ద కర్ణాటక ప్రభుత్వం తుంగభద్ర నదిపై వరద కాలువ, లేదా బ్రిడ్జి కమ్ బ్యారేజ్‌కు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రాంతాన్ని మంగళవారం ఏపీ రైతు సంఘం నాయకులు సందర్శించి ఈ ప్రాంతంలో కర్ణాటక నిర్మిస్తున్న బ్యారేజితో పాటు ఆంధ్ర రైతులకు మేలు జరిగేలా ఏపీ అధికారులు చర్చలు జరిపి వరద కాలువ నిర్మించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలంలో దాదాపు 100టీఎంసీలకు పైగా నీరు వృథాగా సముద్రంలోకి వెళ్తుందని అందుకోసం నదిపై వరదకాలువను నిర్మిస్తే పశ్చిమ ప్రాంతాలైన మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు, కర్నూలు నియోజకవర్గ రైతులకు సాగు, తాగునీరు పుష్కలంగా అంది రైతులు వలసలుపోకుండా వలసలను నివారించవచ్చని తెలిపారు. ప్రతి ఏడాది మంత్రాలయం నియోజకవర్గం నుంచి వలసలు అధికంగా ఉంటాయని నియోజవర్గంలోనే తుంగభద్రనది ఉన్నా అధికారులు, ప్రభుత్వం మాత్రం నదిపై వరద కాలువ నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అనంతరం తుంగభద్రిపై బ్యారేజ్ నిర్మిస్తున్న ప్రదేశంలో నదిలో దిగి నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, మండల కార్యదర్శి ఈరన్న, రైతు సంఘం నాయకులు హనుమంతు, రామాంజనేయులు పాల్గొన్నారు.

17న రేణుకా ఎల్లమ్మదేవి రథోత్సవం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు

కోసిగి ఫిబ్రవరి 11, (ఆంధ్రజ్యోతి): కోసిగి రేణుకా ఎల్లమ్మ దేవి రథోత్సవం ఈ నెల 17న నిర్వహించనున్నారు. రథోత్సవ భద్రతా ఏర్పాట్లను మంగళవారం ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు పరిశీలించారు. ఆలయ పూజారులు మూర్తిగౌడు, కంత, బసవలతో ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఉపేంద్రబాబు మాట్లాడుతూ భక్తులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. దేవాలయ అర్చకులు, కమిటీ సభ్యులు భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే భద్రతా విషయంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని డీఎస్పీ తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా డి.బెళగల్, ఇంటిగ్రేటెడ్ హాస్టల్, రైల్వేగేటు, మార్కెట్ యార్డు దగ్గర వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వేడుకల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. డీఎస్పీ వెంట కోసిగి సీఐ మంజునాథ్, మంత్రాలయం సీఐ రామాంజులు, కోసిగి ఎస్ఐ చంద్రమోహన్, ఏఎస్ఐ నాగరాజు ఉన్నారు.

గ్రామాభివృద్ధి అందరి బాధ్యత



అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

గోనెగండ్ల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి అందరి బాధ్యత అని గ్రామమేజర్ సర్పంచ్ హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ అన్నారు. మంగళవారం గోనెగండ్లలోని పలు వీధిలోని పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కాలువల్లో నిండిన చెత్తను, ముళ్ల పొదలను ట్రాక్టర్, జేసీబీలతో తొలగించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపడుతున్నారని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూసుకుంటామని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామంలో ఇంటి పన్నులు, కొళాయి పన్ను, మార్చి నెల చివరిలోగా వందశాతం వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే గతంలో పెండింగ్‌లో ఉన్న గుత్తలు కూడా వసూళ్లు చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్‌బాషా, అనిల్, సుభాన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

11గంటల్లో ఖురాన్‌ను చదివిన బాలుడు



హాఫీజ్ సలీం

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామానికి చెందిన హాజీ సాబ్ కుమారుడు హాఫీజ్ సలీం 11 గంటల వ్యవధిలో ముస్లిం పవిత్ర గ్రంథం ఖురాన్‌ను పఠించాడు. పట్టణంలోని గోనెగండ్ల బైపాస్ రోడ్డులో ఉన్న నూరాని మసీదులో మదర్‌సా ఇస్లామియా సుల్తానుల ఉలూమ్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్ర మంలో హాఫీజ్ 30 అధ్యాయాల్లో ఉన్న దివ్య ఖురాన్ గ్రంథాన్ని వల్లించి అబ్బుర పరిచాడు. ముఖ్య అతిథిగా మన్సూర్ సాబ్, కారీ హాఫీజ్ ఇనాయతుల్లాసాబ్ బాలుడిని అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు హాఫీజ్ మునిర్, ఖలీల్, ఖాసీం, హాజీ ఇస్మాయిల్ సాబ్, సర్వత్ సాబ్ పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

కోసిగి ఫిబ్రవరి 11, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలోని 3వ వార్డు వాల్మీకినగర్‌లో నివాసముంటున్న కౌతాళం నాగరాజు, పార్వతి దంపతుల గుడిసె ప్రమాదవశాత్తు మంటల్లో దగ్ధమైంది. సర్వం కోల్పోయం.. సాయం చేయండి అన్న ఆంధ్రజ్యోతి కథనానికి పలువురు దాతలు స్పందించి బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్నారు. మంగళవారం మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ మండల ఇన్‌చార్జి మురళి మోహన్ రెడ్డి బాధితులకు రూ.10వేలు ఆర్థిక సాయంతో పాటు బట్టలు అందజేశారు. అలాగే కోసిగికి చెందిన టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా నాయకులు పెండ్యాల భరద్వాజశెట్టి బాధితులకు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. బాధితులు ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, వైసీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షులు జగదీష్ స్వామి, నాగరాజు, ఈరన్న, బుల్లి నరసింహులు, ఎంపీటీసీ వీరస్వామి పాల్గొన్నారు.

చెట్నహళ్లి శ్మశాన స్థలం పరిశీలన

● అడ్డుకున్న బీసీ వర్గీయులు
● నివేదికలు తయారు చేసి కలెక్టర్‌కు పంపుతాం
● ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్



శ్మశాన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మంత్రాలయం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్నహళ్లి గ్రామంలో ఉన్న జగనన్న కాలనీ వద్ద ఉన్న శ్మశాన వాటిక స్థలాన్ని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, తహసీల్దార్ ఎస్.రవి పరిశీలించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో దళిత వర్గాలకు చెందిన కొంత మందిని, బీసీ వర్గాల కొంత మందిని వేర్వేరుగా అభిప్రాయాలను, డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. ఇరువర్గాల అభిప్రాయాలను తెలుసుకున్న సబ్ కలెక్టర్, డీఎస్పీ, తహసీల్దార్ 113 సర్వేలోని జగనన్న లేఅవుట్ కాలనీ ఇళ్ల నిర్మాణాల ముందు శవాలను పూడ్చిన ప్రదేశాలను పరిశీలించారు. సబ్ కలెక్టర్ గ్రామానికి వస్తారని తెలుసుకున్న బీసీ వర్గానికి చెందిన మహిళలు, గ్రామస్థులు, ఎస్సీవర్గాలకు చెందిన కాలనీవాసులు, పెద్ద ఎత్తున్న స్థలంలోకి వచ్చేందుకు ప్రయత్నించారు. మంత్రాలయం, కోసిగి సీఐలు రామాంజులు, మంజునాథ్, ఎస్ఐలు శివాంజల్, చంద్రమోహన్, అధికారుల దగ్గరకు ప్రజలు రాకుండా అడ్డుకున్నారు. 126 సర్వే నెంబరులోని శ్మశాన స్థలానికి పరిశీలించేందుకు వెళ్తున్న అధికారుల కార్లను మహిళలు అడ్డుకున్నారు. సమస్యను ఎలా పరిష్కరిస్తారో చెప్పాలని మహిళలు రస్తాలో భీష్మించారు. దీంతో కొంత వరకు గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఇరువర్గాలను పోలీసులు ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోవాలని మైకుల ద్వారా హెచ్చరించారు. పోలీసులు సర్దిచెప్పడంతో శాంతించారు. 126సర్వే.నెంబరులోని శ్మశాన స్థలాన్ని పరిశీలించి కబ్జాకు గురైన రోడ్డును పరిశీలించారు. జిల్లా అధికారులకు నివేదికలు సమర్పిస్తామని, త్వరలోనే సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అంతవరకు ఇరువర్గాలు ఘర్షణలకు పాల్పడవద్దని సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అశోక్, ఆర్ఐ ఆదాం, వీఆర్వో భీముడు, సర్పంచ్ బెస్త భీమయ్య, ఉప సర్పంచ్ నాగ లింగడు, మాజీ సర్పంచ్ అల్లింగప్ప, ఎంపీటీసీ రామాంజనేయులు, టీడీపీ నాయకులు చాపల నగేష్, రవి దానియేలు, నరసింహులు, ప్రసాద్, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర చట్టం చేయాలి: రైతు సంఘం



తహసీలార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నందవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్ కోరారు. మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం, బ్యాంకు అధికారులు పని చేయాలన్నారు. ఇప్పటి వరకు ఎక్కడ కూడా రైతులకు పంట రుణాలు గాని, పెట్టుబడులకు సహాయం, పంటల బీమా ఇచ్చింది లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శాంతన్న, నరసయ్య, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈవో

నందవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం హలహర్వి, ధర్మాపురంలో పాఠశాలలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పథకాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి ఒక్కరు సమయ పాలన పాటించాలని కోరారు. లేని పక్షంలో శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. సులభమైన బోధన పద్ధతులు అవలంబిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు.

కోసిగిలో దోమల బెడద

కోసిగి ఫిబ్రవరి 11, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలో రోజురోజుకు దోమల బెడద అధికమై ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని, దోమలను నివారించడంలో పంచాయతీ అధికారులు, గ్రామ సర్పంచ్ పూర్తిగా విఫలమయ్యారని జైభీమ్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పందికోన రాజేష్ అన్నారు. మంగళవారం కోసిగిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో దోమలను నివారించేందుకు ఫాగింగ్ చేయలేదన్నారు. కోసిగిలో డ్రైనేజీలు శుభ్రం చేయించడం లేదన్నారు. పారిశుధ్య పనులు చేపట్టి, దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని ఆయన కోరారు.

సాతనూరులో ఘనంగా దేవర



బీర లింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న టీడీపీ నాయకులు

కోసిగి ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతనూరు గ్రామంలో బీర లింగేశ్వరస్వామి దేవర వేడుకలు కురుబ కులస్థుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా దివాకర్‌రెడ్డికి కురుభలు డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి పూలమాలలు, శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మంజునాథ్, రవితేజశెట్టి, కురువ రాముడు, తిక్కయ్య, పెద్ద లక్ష్మన్న, వడ్డె ఉలిగయ్య, బీమయ్య, రాముడు, రామచంద్ర పాల్గొన్నారు.

పరిశ్రమలపై అవగాహన ఉండాలి



మాధవరం స్టీల్ ఫ్యాక్టరీ వద్ద ఇంటర్ విద్యార్థినులు

మంత్రాలయం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పరిశ్రమలపై అవగాహన ఉండాలని మాధవరం మారుతి స్వాత్ (స్టీల్ ఫ్యాక్టరీ) సేఫ్టీ ఇన్‌చార్జి రాజు, సెక్యూరిటీ ఆఫీసర్ మోహన్ రెడ్డి, అకౌంట్స్ ఇన్‌చార్జి శంకర్ అన్నారు. మంగళవారం ఎమ్మిగనూరులోని రావూస్ కళాశాల విద్యార్థినులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా స్టీల్ ఫ్యాక్టరీని సందర్శించారు. డిగ్రీలో బీకాం ఆనర్స్, బీబీఏ ఆనర్స్ మొదటి సంవత్సరం, సెకండియర్ విద్యార్థినులు వాణిజ్య శాస్త్ర విభాగంపై స్టీల్ ఫ్యాక్టరీలో ముడి సరుకు ద్వారా తయారయ్యే పదార్థాల విధానాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు పరిశ్రమల పట్ల అవగాహన కలిగి ఉంటే పారిశ్రామికవేత్తలుగా రాణించవచ్చన్నారు. క్షేత్రస్థాయి పర్యటన వల్ల విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విజయకుమార్, వీరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. కొన్నేళ్లుగా సీసీ రోడ్డు మరమ్మతులకు గురి కావటంతో పాటు యుజీడీ పైప్‌లైన్ పనుల కోసం అని రోడ్డు మధ్యలో తవ్వి వదిలేశారు. దీనికి తోడుగా అక్కడక్కడ గుంతలు పడ్డాయి. దీంతో కాలనీవాసులకు ఇబ్బందిగా మారింది. సీసీ రోడ్డు వేయాలని మున్సిపల్ అధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యేకు విన్నవించటంతో ఎట్టకేలకు అధికారులు రూ. 15లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం పనులు సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. సీసీరోడ్డు నిర్మాణంలో నాణ్యాత ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు.